ఆంధ్రజ్యోతి

ఉష్ణోగ్రత మంగళవారం గరిష్ఠం : 39.0 కనిష్ఠం : 27.0

ANDHRAJYOTHY



5

అనంతపురం

జిల్లా వార్తలు

బుధవారం 23 ఏప్రిల్ 2025

నేడు పది ఫలితాలు

ఉదయం 10 గంటలకు విడుదల



అనంతపురం విద్య, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షల ఫలితాలు బుధవారం విడుదల కానున్నాయి. ఉదయం 10 గంటలకు విడుదల చేయనున్నారు. పది పరీక్షలు మార్చి 17 నుంచి ఏప్రిల్ 1వ తేదీ వరకూ నిర్వహించారు. జిల్లాలో 135 కేంద్రాల్లో 32,803 మంది రెగ్యులర్, ప్రైవేట్ విద్యార్థులు, మరో 1,114 మంది ఓపెన్ విద్యార్థులు రాశారు. ఈనెల 3 నుంచి 9వ తేదీ వరకూ మూల్యాంకనం నిర్వహించారు. బుధవారం రెగ్యులర్‌తోపాటు ఓపెన్ టెన్త్, ఇంటర్ ఫలితాలూ విడుదల కానున్నాయి. ఫలితాలను http :bse.ap.gov.in, http://apopenschool.ap.gov.in వెబ్‌సైట్లలో చూడవచ్చు. మన మిత్ర 9552300009 వాట్సాప్ నంబర్‌కు హాయ్ అని పంపడం ద్వారా కూడా ఫలితాలు పొందవచ్చునని పాఠశాల విద్యాశాఖ ఇప్పటికే ప్రకటించింది. టెన్త్ ఫలితాల నేపథ్యంలో విద్యార్థులు, వారి తల్లిదండ్రుల్లో ఉత్కంఠ నెలకొంది.

జిల్లా న్యాయాధికారిని కలిసిన ఎస్పీ



జిల్లా నూతన న్యాయాధికారికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎస్పీ

అనంతపురం క్రైం, ఏప్రిల్22(ఆంధ్రజ్యోతి): జిల్లా నూతన న్యాయాధికారి భీమారావును ఎస్పీ జగదీష్ మంగళవారం మర్యాద పూర్వకంగా కలిశారు. జిల్లా కోర్టులోని న్యాయాధికారి చాంబర్‌లో ఎస్పీ పుష్పగుచ్ఛం అందజేసి, శుభాకాంక్షలు తెలిపారు. ఇరుశాఖల మధ్య మంచి వాతావరణం నెలకొనేలా సమన్వయంతో ముందకెళ్దామని న్యాయాధికారి, ఎస్పీ ఆకాంక్షించారు.

పన్నుల శాఖలో పేరుకుపోయిన

బకాయిలు

- జీఎస్టీ చెల్లింపునకు 7,810 మంది డీలర్లు ససేమిరా
- సాకులు చెప్పి తప్పించుకుంటున్న కొందరు..
- బోగస్ అడ్రస్‌లతో బురిడీ కొట్టిస్తున్న మరికొందరు..
- నోటీసులిచ్చినా స్పందన కరువు



రూ. 125.50 కోట్లు..!



అనంతపురం క్రైం, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): వాణిజ్య పన్నుల శాఖకు మొండి బకాయిలు గుదిబండగా మారాయి. ఉమ్మడి జిల్లాలో ఏకంగా రూ.125.50 కోట్ల మొండి బకాయిలున్నట్లు అధికారుల లెక్కలు చెబుతున్నాయి. వీటి వసూలు అధికారులకు తలనొప్పిగా మారింది. వస్తు సేవల పన్ను (జీఎస్టీ) చెల్లింపులో కొందరు నిర్లక్ష్యం చేస్తున్నారు. జీఎస్టీ రిజిస్ట్రేషన్ చేయించుకుని ట్యాక్స్ చెల్లించకుండా అలసత్వం ప్రదర్శిస్తున్నారు. వీరిలో కొందరు ఏళ్లుగా ఇదే వైఖరి అవలంబిస్తున్నారు. వాస్తవానికి పన్నుల శాఖ జిల్లా అధికారులు 2024-25 సంవత్సరానికి విధించిన లక్ష్యాన్ని అధిగమించారు. రూ.368.98 కోట్లు టార్గెట్ విధించగా.. రూ.381.18 కోట్ల ఆదాయం చేకూర్చారు. జిల్లాలో ఆ శాఖకు మొండి బకాయిలు తలనొప్పిగా మారాయి. ఈ శాఖలో కొన్నేళ్లుగా పన్నుల ఎగవేతదారులూ చాలామందే ఉన్నారు. నకిలీ చిరునామాలతో రిజిస్ట్రేషన్లు చేయించుకుని పన్ను ఎగ్గొట్టిన వ్యాపారులున్నారు. ప్రస్తుతం రూ.వంద కోట్లకు పైగా బకాయిలున్నాయి. అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల పరిధిలోని డీలర్ల నుంచి ఈ అరియర్స్ రావాల్సి ఉంది. అధికారులు నోటీసులు పంపుతున్నా.. వారి నుంచి కనీస స్పందన కరువవుతున్నట్లు తెలుస్తోంది. కొందరు వ్యాపారులు.. రాజకీయ నాయకుల పేర్లు చెప్పి సైతం పన్ను చెల్లింపును మరింత ఆలస్యం చేస్తున్నట్లు సమాచారం.

అనంతలోనే అధికం

పన్నుల శాఖ అనంతపురం సంయుక్త కమిషనర్ పరిధిలో ఉమ్మడి జిల్లాలున్నాయి. వీటి పరిధిలో మొత్తం ఏడు సర్కిళ్లు అనంతపురం-1, అనంతపురం-2, గుంతకల్లు, హిందూపురం, కళ్యాణదుర్గం, పుట్టపర్తి, తాడిపత్రి ఉన్నాయి. వీటికి సంబంధించి మొత్తం రూ.125.50 కోట్ల బకాయిలున్నాయి. 7,810 మంది డీలర్లు ఈ పన్ను చెల్లించాల్సి ఉంది. అత్యధికంగా అనంతపురం సర్కిల్ పరిధిలో 1460 మంది డీలర్లు బకాయిలు పడ్డారు. వారి నుంచి 54.61 కోట్ల పన్ను పెండింగ్‌లో ఉంది.

నోటీసులిచ్చినా స్పందన కరువు

పన్నుల శాఖ అధికారులు మొండి బకాయిలపై దృష్టి సారిస్తున్నా కనీస స్పందన ఉండటం లేదని తెలుస్తోంది. ఏటా చెల్లించకుండా తప్పించుకు తిరిగే డీలర్లకు నోటీసులు పంపుతున్నారు. వాటికి సమాధానం ఇచ్చేవారే కరువయ్యారట. 7,800 మంది డీలర్లలో దాదాపు వందల మంది పూర్తి పన్ను ఎగ్గొట్టే ఆలోచనలో ఉన్నట్లు సమాచారం. కొందరు జీరో బిజినెస్‌తో పన్ను ఎగ్గొట్టి పన్నుల శాఖ ఆదాయానికి గండి కొడుతున్నారు. జీఎస్టీ ముసుగులో మరికొందరు ఇలా పన్ను చెల్లించకుండా జగమొండిగా తయారయ్యారు. ఒకానొక సందర్భంలో అధికారులు.. పోలీసుల సాయంతో మొండిగా వ్యవహరిస్తున్న డీలర్ల నుంచి పన్ను వసూలు చేయడానికి సన్నద్ధమైనట్లు తెలుస్తోంది. ఆ ప్రక్రియకు కొన్ని అనివార్య కారణాలతో బ్రేక్ పడినట్లు సమాచారం. రూ.30లక్షలుపైగా బకాయిలున్న డీలర్లు రాజకీయ నాయకుల సిఫార్సులతో పన్ను చెల్లించకుండా తప్పించుకుంటున్నారు. ఇంకొందరు ఉద్దేశపూర్వకంగా అధికార పార్టీ నేతల పేర్లు చెప్పి కాలయాపన చేస్తున్నారట. ఈ పరిస్థితుల్లో అధికారులకు ఈ బకాయిదారుల నుంచి పన్నులు వసూలు
చేయడానికి ఎంత సమయం పడుతుందో..?

సర్కిల్	బకాయిపడ్డ డీలర్ల సంఖ్య	మొత్తం బకాయి
అనంతపురం-1	1,460	రూ.54.61 కోట్లు
అనంతపురం-2	528	రూ.8.96 కోట్లు
గుంతకల్లు	905	రూ.3.80 కోట్లు
హిందూపురం	923	రూ.23.67 కోట్లు
కళ్యాణద్గుం	1,040	రూ.8.32 కోట్లు
పుట్టపర్తి	573	రూ.9.61 కోట్లు
తాడిపత్రి	2381	రూ.16.54 కోట్లు
మొత్తం	7,810	రూ.125.50 కోట్లు

బకాయిల వసూలుపై దృష్టి పెట్టాం

కొన్నేళ్లుగా పన్ను బకాయిలున్నాయి. తరచూ సంబంధిత డీలర్లకు నోటీసులు పంపిస్తున్నాం. వాటి వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించాం. బోగస్ జీఎస్టీ రిజిస్ట్రేషన్లనూ ఉపేక్షించేది లేదు. 2025-26 సంవత్సరానికి సంబంధించి ఇప్పటి నుంచే ప్రణాళిక సిద్ధం చేస్తున్నాం.

-శేషాద్రి, జాయింట్ కమిషనర్, పన్నుల శాఖ

ఢిల్లీకి కలెక్టర్ వినోద్‌కుమార్



అనంతపురంటౌన్, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): యూపీఎస్సీ పరీక్షల సన్నాహక సమావేశంలో పాల్గొనేందుకు కలెక్టర్ వినోద్‌కుమార్ మంగళవారం ఢిల్లీకి వెళ్లారు. సివిల్ సర్వీసెస్ ప్రిలిమినరీ పరీక్ష నిర్వహణకు యూపీఎస్సీ మే 25న షెడ్యూల్ ఇచ్చింది. ఈ పరీక్ష నిర్వహణకు బుధవారం ఢిల్లీలో సన్నాహక సమావేశం నిర్వహిస్తోంది. అన్ని రాష్ట్రాల నుంచి కొంత మంది కలెక్టర్లను ఆహ్వానించింది. అందులో ఆంధ్రప్రదేశ్ నుంచి నలుగురు కలెక్టర్లకు అవకాశం రాగా.. విశాఖపట్నం, తిరుపతి, విజయవాడ కలెక్టర్లతో పాటు అనంత కలెక్టర్‌కు స్థానం కల్పించారు. ఆయన తిరిగి వచ్చేవరకు జాయింట్ కలెక్టర్ శివనారాయణశర్మ ఇన్‌చార్జ్ కలెక్టర్‌గా వ్యవహరిస్తారు.

సర్వేయర్ల పనితీరు బ్యాడ్

- ఐవీఆర్ఎస్ సర్వేలో వెల్లడి
- అక్రమాలకు పాల్పడినట్లయితే చర్యలు తీసుకోండి
- అధికారులకు కలెక్టర్ ఆదేశాలు

అనంతపురం టౌన్, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): గ్రామ సర్వేయర్లపై అనేక చోట్ల ఐవీఆర్ఎస్ సర్వేలో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైందని కలెక్టర్ వినోద్‌కుమార్ అసంతృప్తి వ్యక్తం చేశారు. కలెక్టరేట్‌లోని రెవెన్యూభవన్‌లో ఆర్డీఓలు, తహసీల్దార్లు, సర్వేయర్లతో మంగళవారం సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రభుత్వ అధికారులు, ఉద్యోగుల పనితీరుపై ఐవీఆర్ఎస్ ద్వారా ప్రజాభిప్రాయం సేకరిస్తున్నారన్నారు. జిల్లాలో ఈసారి గ్రామ సర్వేయర్లపై అత్యధికంగా ప్రజల నుంచి వ్యతిరేకత వచ్చిందన్నారు. ఇందులో ఒక గ్రామ సర్వేయర్‌పై తీవ్ర ఆరోపణలు వచ్చాయన్నారు. కళ్యాణదుర్గం డివిజన్‌లో 37, అనంతపురం పరిధిలో 30, గుంతకల్లులో 14 మంది గ్రామ సర్వేయర్లపై ప్రజల నుంచి వ్యతిరేకత వ్యక్తమైందన్నారు. ఆయా సర్వేయర్లపై నిఘాపెట్టి తప్పుచేసినట్లు తేలితే చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆ తర్వాతి స్థానంలో పౌరసరఫరాల శాఖ పనితీరుపై ప్రజలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారన్నారు. కార్డుదారుల నుంచి డబ్బు వసూలుచేస్తున్న ఎండీయూ ఆపరేటర్లపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. నిబంధనల మేరకు ఎండీయూ వాహనాలు తిరుగుతూ సరకులు పంపిణీ చేసేలా చూడాలన్నారు. ఈకేవైసీ పూర్తి చేయించాలన్నారు. ప్రభుత్వం ఐవీఆర్ఎస్ ద్వారా నేరుగా ప్రజలతో మాట్లాడి అభిప్రాయాలు తీసుకుంటోందనీ, ప్రతిఒక్కరూ బాధ్యతగా పనిచేయాలని కలెక్టర్ దిశానిర్దేశం చేశారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ శివనారాయణ శర్మ, డీఆర్వో మలోల, ఆర్డీఓ కేశవనాయుడు, సర్వే ఏడీ రూప్లానాయక్, ఇన్‌చార్జి డీఎస్ఓ జగన్మోహన్, తహసీల్దార్లు, సీఎస్‌డీటీలు, సర్వేయర్లు పాల్గొన్నారు.

నెలాఖరుకల్లా ఈకేవైసీ చేయించుకోవాలి

జాయింట్ కలెక్టర్ శివనారాయణశర్మ



అనంతపురం టౌన్, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): రేషన్‌కార్డుల్లో ఉన్నవారిలో ఇప్పటి వరకు ఈకేవైసీ చేయించుకోని వారందరూ.. నెలాఖరులోగా పూర్తి చేసుకోవాలని జాయింట్ కలెక్టర్ శివనారాయణశర్మ, ఇన్‌చార్జ్ డీఎస్ఓ జగన్నాథ్‌రావు మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. రేషన్‌కార్డుల్లో ఉన్నవారు జిల్లాలో ఇంకా 1,18,186 మంది ఈకేవైసీ చేయించుకోలేదన్నారు. వీరందరికి ఈనెల 30వ తేదీ వరకు గడువు ఇచ్చామని, సమీపంలోని డీలర్లు, గ్రామకార్యదర్శి, గ్రామవార్డు సచివాలయాల వద్దకు వెళ్లి ఈకేవైసీ నమోదు చేయించుకోవాలని పేర్కొన్నారు.

బోగస్‌లలో గుబులు
- టీచర్ల మెడికల్ సర్టిఫికెట్ల పరిశీలనకు నిర్ణయం
- ఫేక్ సర్టిఫికెట్లతో లబ్ధిపొందిన వారిలో టెన్షన్

6లో

రేపటి నుంచి మెడికల్ సర్టిఫికెట్ల వెరిఫికేషన్ 7లో

పలువురు న్యాయాధికారుల బదిలీ 7లో

తోడేస్తున్నారు..!

చెరువులో జలచౌర్యం

- పైపులైన్ ద్వారా తరలిస్తున్న ఇతర గ్రామాల వారు..
- వేసవి ప్రారంభం కావడంతో తలెత్తుతున్న నీటి ఎద్దడి
- అడుగంటుతున్న భూగర్భజలాలు



నాయకునిపల్లి రోడ్డువైపు వేసిన పంపు మోటారు


పుట్లూరు, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం పరిధిలోని ఎల్లోజి పంతులు చెరువులో యథేచ్ఛగా జలచౌర్యం చేస్తున్నారు. చెరువు గట్టున కొందరు బోర్లు వేసి జలచౌర్యానికి పాల్పడుతుంటే.. మరికొందరు మరో అడుగు ముందుకేసి చెరువులోకే పంపుమోటార్లను దించి నీటిని తోడేస్తున్నారు. దీంతో మండలకేంద్రంలో నీటి ఎద్దడి తలెత్తుతోంది. పుట్లూరుతోపాటు నాయకునిపల్లి, పి.చింతలపల్లి ఎస్సీ కాలనీలకు తాగునీటి సమస్య అధికమైంది. చెరువులోని నీరు తోడేస్తే చుట్టుపక్కల బోర్లు సైతం ఎండిపోయే అవకాశం ఉంది. పరిస్థితి ఇలాగే ఉంటే చెరువులో వదిలిన చేపపిల్లల పరిస్థితి అగమ్యగోచరంగా మారనుంది. చెరువు పరిసర ప్రాంతాల్లో 30కిపైగా బోర్లు ఉన్నాయి. ఇతర గ్రామాలకు చెందిన బోర్లు కావడంతో చెరువులోకి హెచ్చెల్సీ నీరు వచ్చినపుడు అధికారుల కళ్లుగప్పి జలచౌర్యం చేస్తుంటారు. చెరువు ఇంకిపోయి మండలకేంద్రంలో తాగునీటి సమస్య తలెత్తుతోంది. వేసవి ప్రారంభం కావడంతో సమస్య జఠిలమయ్యే అవకాశం ఉందని గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు. చెరువులో ఉన్న నీరు తోడేస్తే తాగునీటికి ఇబ్బందులు తలెత్తుతాయని అధికారులకు ఫిర్యాదు చేశారు.

పైపులైన్ ద్వారా తోడేస్తున్నవైనం

పుట్లూరు మండలకేంద్రంలోని చెరువు పక్కనే పి. చింతలపల్లి, నాయకునిపల్లి, బాలాపురం తదితర గ్రామాలకు చెందిన కొందరు రైతులు అక్రమంగా బోర్లు వేశారు. అక్కడి నుంచి పైప్‌లైన్ ద్వారా తోటలకు నీటిని తోడేస్తుంటారు. గతంలో సమస్య ఎక్కువగా ఉండడంతో అప్పటి అధికారులు బోర్లలోని మోటార్లను తీసి, స్వాధీనం చేసుకున్నారు. కొందరు రైతులపై కేసులు నమోదుచేసిన సందర్భాలు లేకపోలేదు. ఇప్పటికీ 14 మంది రైతులకు చెందిన 26 బోర్లను అధికారులు గుర్తించారు. మరికొన్నిచోట్ల బోర్లను సీజ్ చేశారు. తర్వాత అధికారులు పట్టించుకోకపోవడంతో గతంలో ఉన్న బోర్లకు అదనంగా మరికొన్ని బోర్లను రైతులు ఏర్పాటు చేసుకున్నారు. ఈ తతంగం అధికారులకు తెలిసే జరుగుతోందన్న ఆరోపణలు లేకపోలేదు. ప్రజలు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్న విమర్శలున్నాయి. తాగునీటికే ఇబ్బందులు పడుతుంటే.. సాగు అవసరాలకు ఎలా వాడుకుంటారని అధికారులను నిలదీసినా ఫలితం లేకుండాపోయింది.



చెరువు పైభాగాన వేసిన పైపులైన్



ఎల్లోజి పంతులు చెరువు

అడుగంటుతున్న భూగర్భజలాలు

మండలంలో భూగర్భ జలాలు అడుగంటిపోతున్నాయి. మండలకేంద్రంతోపాటు చుటుపక్కల పరిధి కిలోమీటర్ల మేర బోర్లు ఎండిపోతున్నాయి. 300 అడుగుల లోతులో రెండు ఇంచుల మేర నీరు వచ్చేది. ప్రస్తుతానికి 500 అడుగలకు పైగా బోర్లు వేస్తున్నా అర ఇంచులోపే నీరు ఉంటోంది. మరికొన్నిచోట్ల 600 నుంచి 700 అడుగుల వరకు బోర్లు వేస్తున్నా నీటి జాడ కనిపించడం లేదు. మండలకేంద్రంలోనే రెండుచోట్ల బోర్లు వేసినా ఇంచు నీరు మాత్రమే వస్తోంది. మార్చిలోనే ఇలా ఉంటే ఏప్రిల్, మే నెలల్లో పరిస్థితి ఎలా ఉంటుందో ఊహకు అందడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి జలచౌర్యానికి అడ్డుకట్ట వేయాల్సిన అవసరం ఉంది.



జాగిలంతో తనిఖీ చేస్తున్న పోలీసులు

రైల్వే స్టేషన్‌లో తనిఖీలు

అనంతపురం క్రైం, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): డ్రగ్స్ నియంత్రణలో భాగంగా త్రీటౌన్ పోలీసులు డాగ్ స్క్వాడ్‌తో స్థానిక రైల్వేస్టేషన్‌లో మంగళవారం తనిఖీలు చేపట్టారు. భువనేశ్వర్ నుంచి బెంగళూరుకు వెళ్లే ప్రశాంతి ఎక్స్‌ప్రెస్ రైలులో క్షుణ్ణంగా తనిఖీలు చేశారు. అనుమానాస్పదులు, వారి లగేజీలను పైనీ జాగిలంతో తనిఖీ చేశారు.

గవర్నమెంట్‌కు అమ్మలేం..!

- పప్పుశనగ విక్రయించేందుకు రైతుల నిరాసక్తత
- బయట మార్కెట్‌లో ధర ఎక్కువగా ఉండటమే కారణం



బెళుగుప్ప గోదాములో నిల్వ చేసిన పప్పుశనగ

అనంతపురం అర్బన్ ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): ఈ సారి జిల్లాలో పప్పుశనగ కొనుగోలు ప్రక్రియ లేనట్లేనన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వ మద్దతు ధరతో పోలిస్తే బహిరంగ మార్కెట్‌లో ధర ఎక్కువగా ఉండటంతో పప్పుశనగను కొనుగోలు కేంద్రాల్లో విక్రయించేందుకు రైతులు ఆసక్తి చూపడం లేదు. ఈ సారి పప్పుశనగ క్వింటా మద్దతు ధర రూ.5650లుగా ప్రభుత్వం నిర్ణయించింది. రిజిస్ట్రేషన్ ఆరంభించే ముందు మద్దతు ధర కంటే బహిరంగ మార్కెట్ ధర తక్కువగా ఉండింది. రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఆరంభించిన తర్వాత ధర పెరిగింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో పప్పుశనగ దిగుబడిని విక్రయించేందుకు ముందుకు రావడం లేదు. రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఆరంభమైన కొద్ది రోజులకే ధర పెరగడంతో కొనుగోలు కేంద్రాల్లో తాము పప్పుశనగను విక్రయించడం లేదని ఆయా కేంద్రాల నిర్వాహకులకు రైతులు స్పష్టం చేసినట్లు సమాచారం. కొందరు రైతులు బహిరంగ మార్కెట్‌లో పప్పుశనగను విక్రయించగా... మరింతగా ధర పెరుగుతుందన్న ఆశతో మరికొందరు గోదాముల్లో నిల్వ చేసుకున్నారు.

24 మంది మాత్రమే రిజిస్ట్రేషన్

రైతుల నుంచి పప్పుశనగ కొనుగోలు బాధ్యతలను ఏపీమార్క్‌ఫెడ్‌కు ప్రభుత్వం అప్పగించింది. ఆ సంస్థ అధికారులు ప్రాథమిక సహకార సంఘాలు, రైతు ఉత్పత్తిదారుల సంఘాలకు అప్పగించారు. ఈ ఏడాది ఫిబ్రవరి 11 నుంచి రైతు సేవా కేంద్రాల్లో పప్పుశనగ దిగుబడులను విక్రయించాలనుకునే రైతులు తమ పేర్లు నమోదు చేసుకోవాలని సంబంధిత అధికారులు సూచించారు. రెండు నెలల రిజిస్ట్రేషన్ ప్రక్రియలో ఇప్పటి దాకా 24 మంది రైతులు రైతు సేవా కేంద్రాల్లో తమ పేర్లు రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. అయితే మద్దతు ధర కంటే బయట మార్కెట్‌లో ధర ఎక్కువ కావడంతోనే రిజిస్ట్రేషన్ సంఖ్య తక్కువగా ఉన్నట్లు సమాచారం. ఇదే విషయాన్ని సంబంధిత అధికారులు రాష్ట్ర ఉన్నతాధికారులకు నివేదించినట్లు సమాచారం.

బహిరంగ మార్కెట్‌లోనే ధర ఎక్కువ

మద్దతు ధర కంటే బహిరంగ మార్కెట్‌లో ధర ఎక్కువగా ఉండటంతోనే రైతులు ఆసక్తి చూపడం లేదు. ఈ ఏడాది మార్చి 11 నుంచి జిల్లాలోని రైతు సేవా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఆరంభమైంది. ఇప్పటి దాకా ఐదు మండలాల్లో 24 మంది రైతులు మాత్రమే రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. రిజిస్ట్రేషన్ ప్రక్రియ మొదలు పెట్టిన తర్వాత మద్దతు ధర కంటే బయట మార్కెట్‌లో ధర పెరిగింది. ఈ కారణంతోనే రైతు సేవా కేంద్రాల్లో రైతులు రిజిస్ట్రేషన్ చేసుకోవడం లేదు. రిజిస్ట్రేషన్ చేసుకున్న ఆయా రైతులు కూడా కొనుగోలు కేంద్రాల్లో విక్రయించేందుకు ఆసక్తి చూపడం లేదు. క్షేత్ర స్థాయిలో వాస్తవ పరిస్థితిని ఇప్పటికే రాష్ట్ర ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లాం.

- పెన్నేశ్వరి, ఏపీ మార్క్‌ఫెడ్ మేనేజర్, అనంతపురం

రైలు దొంగల సవాల్
- కొత్త ప్లాన్లతో విరుచుకుపడుతున్న వైనం..
- జీఆర్పీకి తలనొప్పిగా మారిన కట్టడి


6

బోగస్‌లలో గుబులు

● టీచర్ల బదిలీలకు సిద్ధమైన విద్యాశాఖ ● గతంలో కొందరు ఫేక్ సర్టిఫికెట్లతో అడ్డగోలు లబ్ధి

- కుప్పలుతెప్పలుగా వినికిడి లోపం సర్టిఫికెట్లు
- టిస్ సమాచారం మేరకు ప్రిఫరెన్షియల్ కేటగిరీలో 627 మంది..
- వాటి స్ర్కూటినీ, కొత్తవి మంజూరుకు రేపట్నుంచి మెడికల్ క్యాంపులు
- అయ్యవార్లలో టెన్షన్





అనంతపురం విద్య, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులకు కొత్త గుబులు పట్టుకుంది. టీచర్ల బదిలీల కోసం ఇప్పటికే ప్రభుత్వం తొలిసారి ఆంధ్ర ప్రదేశ్ ఉపాధ్యాయ బదిలీల యాక్ట్-2025 తీసుకొచ్చింది. ఈ క్రమంలో ప్రిఫరెన్షియల్ కేటగిరీ కింద అదనపు పాయింట్లు పొందిన టీచర్ల సర్టిఫికెట్ల పరిశీలనకు సిద్ధమైంది. మూడు రోజులపాటు మెడికల్ క్యాంపులు నిర్వహించి పాత వాటిని స్ర్కూటినీ చేసి.. కొత్త వాటిని ఇవ్వనున్నారు. దీంతో టీచర్లకు కొత్త పరీక్షలు గుబులు పుట్టిస్తున్నాయి. చాలామంది టీచర్లు లేని చెవుడు ఉన్నట్టు, రాని రోగాలు కూడా వచ్చినట్లు, తమ పిల్లలు, తల్లిదండ్రులు డిపెండెంట్స్ అంటూ బోగస్ సర్టిఫికెట్లు పొందారు. వాటి ద్వారా స్పెషల్ పాయింట్లు పొంది బదిలీల్లో లబ్ధి పొందారు. తీరా ఈనెల 24, 25, 26 తేదీల్లో మూడు రోజులపాటు వైద్య పరీక్షలు, సర్టిఫికెట్ల పునఃపరిశీలన ఉండటంతో అక్రమార్కులు కళ్లు తేలేస్తున్నారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ప్రిఫరెన్షియల్ కేటగిరీ టీచర్లు 627 మంది ఉన్నట్లు స్వయానా వారే ప్రకటించుకున్నారు. టీచర్స్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ (టిస్)లో నమోదు చేసుకున్నారు. అవి సుమారు 1,000 వరకూ ఉంటాయని విద్యాశాఖ అంచనా వేస్తోంది. ఈ నేపథ్యంలో ఆయా టీచర్లలో కొత్త పరీక్షల టెన్షన్ మొదలైంది.

రేపట్నుంచి క్యాంపులు..

ఇప్పటికే సర్టిఫికెట్లు ఉన్న టీచర్లు ఇప్పుడు 24వ తేదీ నుంచి 3 రోజులపాటు నిర్వహించే వైద్య శిబిరాల్లో వాటిని వెరిఫికేషన్ చేసుకోవాలి. డాక్టర్లు.. టీచర్ల పాత సర్టిఫికెట్లు పరిశీలించడంతోపాటు, వారి డిపెండెంట్స్‌కు వైద్య పరీక్షలు నిర్వహిస్తారు. వైద్య పరీక్షల్లో తప్పని తేలితే... రిజక్ట్ చేస్తారు. ఈ మెడికల్ క్యాంపు ల్లో జారీచేసిన కొత్త సర్టిఫికెట్ల ఆధారంగానే బదిలీల్లో టీచర్లకు ప్రిఫరెన్షియల్, స్పెషల్ పాయింట్లు కేటాయిస్తారు.



గతంలో బదిలీల కౌన్సెలింగ్‌కు హాజరైన టీచర్లు

చాలామంది బోగస్ బాట...

గతంలో చాలామంది టీచర్లు బోగస్ సర్టిఫికెట్ల బాట పట్టారు. చెవుడు లేకున్నా...ఉన్నట్టు, పిల్లలు, తల్లిదండ్రులకు సైతం లేని మానసిక జబ్బులు ఉన్నట్టుగా కూడా చూపి స్పెషల్ పాయింట్లు పొందడంతోపాటు, ప్రిఫరెన్షియల్ కేటగిరీ కింద లబ్ధి పొందారు. కొందరు టీచర్లు నియామకాల్లో సైతం ఇదే ఫార్ములా ఉపయోగించారు. విశ్వసనీయ సమాచారం మేరకు.. 1994 డీఎస్సీలో కొందరు అభ్యర్థులు చెవుడు ఉందని ఫేక్ సర్టిఫికెట్లు పెట్టి లబ్ధిపొందారని సమాచారం. ఎవరూ గుర్తించకపోవడంతో 1996, 1998 డీఎస్సీల సమయంలో కుప్పలుతెప్పలుగా అభ్యర్థులు చెవుడు ఉందని ఫేక్ సర్టిఫికెట్లు చూపించి, ఉద్యోగాల్లో చేరారు. తర్వాత కాలంలో ఉపాధ్యాయుల బదిలీల్లోనూ ఇదే కొనసాగించారని సమాచారం. అంతే కాకుండా తమ పిల్లలు, తల్లిదండ్రులు సైతం డిపెండెంట్స్ అంటూ సర్టిఫికెట్లు చూపి లబ్ధి పొందారు. ఇలాంటివారు చాలామందే ఉన్నారు. మూడేళ్ల కిందట బుక్కరాయసముద్రం మండం లోని ఒక స్కూల్‌లో పనిచేసిన హెచ్‌ఎం తనకు 80 శాతం అంగవైకల్యం ఉందంటూ సర్టిఫికెట్ పెట్టి బదిలీల్లో లబ్ధి పొందారు. ఆమె నిత్యం కారులో స్కూల్‌కు వచ్చేవారని తోటి టీచర్లే చెబుతారు. 80 శాతం అంగవైకల్యం ఉన్న ఆమె కారు డ్రైవ్ చేస్తూ.. స్కూల్‌కు ఎలా వస్తారన్నది వింటుంటే.. ఏ స్థాయిలో బోగస్ సర్టిఫికెట్ సృష్టించారో ఇట్టే అర్థమవుతోంది. మరికొందరు ఉపాధ్యాయ సంఘాల నేతలు సైతం చెవుడు ఉందని చెప్పి సర్టిఫికెట్లు చూపించి బదిలీల్లో లబ్ధి పొందుతున్నారు. ఇంకా కొందరు టీచర్లు చిన్నపాటి రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన ఘటనలను చూపి దివ్యాంగులుగా చిత్రీకరించి... లబ్ధిపొందారు. కొందరు టీచర్లు.. వైద్యులకు రూ.30 వేలు, రూ.50 వేలు లంచాలు ఇచ్చుకుని, దొడ్డిదారిలో సర్టిఫికెట్లు పొందారు కూడా. ఇలా చెప్పుకుంటూ వెళ్తే... చాలా మంది టీచర్లు బోగస్ సర్టిఫికెట్ల బాట పట్టి... అడ్డదారులు తొక్కి అర్హుల అవకాశాలకు గండి కొట్టారు.

పరీక్షలు పారదర్శకంగా నిర్వహిస్తే..

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా అధికారికంగా ప్రిఫరెన్షియల్, స్పెషల్ పాయింట్ల కేటగిరీ టీచర్లు 672 మంది ఉన్నట్లు టిస్ ద్వారా తెలుస్తోంది. వాస్తవానికి 1000 మంది వరకూ టీచర్లు ఉంటారని జిల్లా విద్యాశాఖాధికారులు అంచనా వేస్తున్నారు. టిస్ రిపోర్ట్ మేరకు 627 మంది మాత్రమే ఉంటే.. మిగిలిన వారు దొడ్డిదారిలో వచ్చిన వారైనా ఉండాలి, లేదంటే టిస్‌లో అప్‌డేట్ చేయనివారైనా ఉండాలి. ఉద్దేశపూర్వకంగానైనా టిస్‌లో అప్‌లోడ్ చేయని వారైనా ఉండాలి. స్పెషల్ మెడికల్ క్యాంపుల్లో పారదర్శకంగా పరీక్షలు నిర్వహిస్తే.. బోగస్ సర్టిఫికెట్ల బాగోతం బయటపడుతుందనడంతో సందేహం లేదు. డాక్టర్లకు మామూళ్లు ఇచ్చి సర్టిఫికెట్లు చేయించుకున్నోళ్లు చాలామందే ఉన్నారు. ఇప్పుడు మళ్లీ స్పెషల్ మెడికల్ క్యాంపుల్లో వాళ్లు ఇచ్చిన సర్టిఫికెట్లు అదే డాక్టర్ల చేతికి చేరితే.. మళ్లీ అక్రమాలు జరిగే ప్రమాదం ఉంది. జిల్లా ఉన్నతాధికారులు దీనిపై దృష్టి పెడితే.. అక్రమాలకు చెక్ పడే అవకాశం ఉంటుంది. ఇతర జిల్లాల డాక్టర్లనైనా నియమించాలి, విద్యాశాఖ, వైద్యశాఖల సమన్వయంతో పారదర్శకంగానైనా పరీక్షలు నిర్వహించాలి. అప్పుడే అక్రమార్కులు బటయపడే అవకాశం ఉంది.

అర్హతలు ఇవీ..

- శారీరక వైకల్యం 40 శాతం నుంచి 70 శాతం అంతకంటే ఎక్కువ విజువల్లీ చాలెంజ్డ్, ఆర్థోపెడికల్లీ చాలెంజ్డ్, హియరింగ్ ఇంపెయిర్డ్ ఉద్యోగులకు స్పెషల్ పాయింట్లు కేటాయిస్తారు.
- శారీరక వైకల్యం 80 శాతం, అంతకంటే ఎక్కువ విజువల్లీ చాలెంజ్డ్, ఆర్థోపెడికల్లీ చాలెంజ్డ్ ఉన్న ఉద్యోగులకు బదిలీల్లో స్పెషల్ పాయింట్లు వర్తిస్తాయి.
- మెడికల్ గ్రౌండ్స్ కింద క్యాన్సర్, ఓపెన్‌హార్ట్ సర్జరీ/అట్రియల్ సెప్టెల్ డిఫెక్ట్/అవయవ మార్పిడి, మేజర్ న్యూరో సర్జరీ, ఎముకల టీబీ, కిడ్నీల మార్పిడి/డయాలసిస్, స్పైనల్ సర్జరీ, మానసిక జబ్బులతో బాధపడే పిల్లలుగానీ, భార్యగానీ ఉండి ఉద్యోగిపై ఆధారపడి ఉండటంతోపాటు చికిత్స పొందుతూ ఉండాలి.
- జువైనల్ డయాబెటిస్, థలసీమియా, హీమోఫీలియా, మస్క్యులర్ డిస్ట్రోఫీ వ్యాధులతో బాధపడే పిల్లలు.. ఉద్యోగిపై ఆధారపడి ఉండటంతో పాటు చికిత్స పొందుతూ ఉండాలి.
- హృదయ రంధ్రాల లోపంతో జన్మించిన పిల్లలకు ఆపరేషన్ చేసిన తేదీ నుంచి 3 ఏళ్లలోపు ఉండాలి (ఇలాంటి పిల్లలున్న ఉద్యోగికి).

జై జవాన్ జై కిసాన్

అతడిదో సాధారణ రైతు కుటుంబం. చదువుకుంటూనే పొలం పనుల్లో తల్లిదండ్రులకు తోడు ఉండేవాడు. ఇంటర్ చదువుతున్న సమయంలో ఆర్మీకి ఎంపికయ్యాడు. దేశంలోని వివిధ ప్రాంతాల్లో సుమారు 17 ఏళ్ల పాటు సేవలందించి రిటైర్డ్ అయ్యాడు. అనంతరం స్వగ్రామానికి చేరుకుని తనకు ఎంతో ఇష్టమైన సేద్యంలోకి దిగాడు. సేంద్రియ పద్ధతులతో వివిధ రకాలు పంటలు సాగు చేసి, మంచి దిగుబడులతో లాభాలు ఆర్జిస్తున్నాడు. ఆయనే కనగానపల్లి మండలం మామిళ్లపల్లి గ్రామానికి చెందిన రిటైర్డ్ సైనికుడు శ్రీనివాస్‌రెడ్డి.



- వ్యవసాయంలో రాణిస్తున్న మాజీ సైనికుడు
- సీజన్‌కు అనుగుణంగా పంటల సాగు
- మంచి దిగుబడులతో ఆదర్శంగా నిలుస్తున్న శ్రీనివాస్‌రెడ్డి



కుటుంబ నేపథ్యం

శ్రీనివాస్‌రెడ్డిది వ్యవసాయ కుటుంబం. తల్లి ఆదిలక్ష్మి, తండ్రి కృష్ణారెడ్డి నిత్యం పొలం పనులు చేస్తుండేవారు.వీరికి సాయంగా చిన్నకుమారుడైన శ్రీనివాస్‌రెడ్డి సెలవు రోజుల్లో పనులకు వెళ్లేవాడు. అలా వ్యవసాయం మీద మోజు ఏర్పడింది. అయితే తల్లిదండ్రులు మాత్రం సేద్యం వద్దని, బాగా చదువుకుని ఉద్యోగం తెచ్చుకోమని చెబుతుండేవారు. ఈక్రమంలోనే 2001లో పదో తరగతి పూర్తి చేసి ధర్మవరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్‌లో చేరాడు. మొదటి సంవత్సరం చదువుతున్న సమయంలో ఆర్మీకి సెలక్ట్ అయ్యాడు. శిక్షణ అనంతరం శ్రీనగర్, జమ్మూకశ్మీర్ వంటి వివిధ ప్రాంతాల్లో పని చేశాడు. ఆర్మీలో పని చేసే సమయంలోనే వివాహం చేసుకున్నాడు. ఈయనకు ఇద్దరు సంతానం ఉన్నారు.

జవాన్ నుంచి కిసాన్‌గా...

2019లో జవాన్‌గా రిటైర్డ్ అయిన శ్రీనివాస్‌రెడ్డి కిసాన్‌గా మారాడు. ఆర్మీ నుంచి ఇంటికొచ్చాక తమ కుటుంబానికి ఉన్న 15 ఎకరాల భూమిని సాగులోకి తెచ్చాడు. ఇందులో చీనీ, వేరుశనగ, వరి, మిరప, టమోటా వంటి పంటలు పండిస్తున్నాడు. ఆరు బోరు బావుల ద్వారా డ్రిప్పులు, స్ప్రింక్లర్ల సాయంతో పంటలకు నీటి తడులు అందిస్తున్నాడు. పెరిగిన సాంకేతిక పరిజ్ఞానాన్ని వాడుకుంటూ, సేంద్రియ వ్యవసాయ పద్ధతులు పాటిస్తూ మంచి దిగుబడులు సాధిస్తున్నాడు. కనగానపల్లిలో లైన్‌మన్‌గా పని చేస్తున్న తన అన్న రాజశేఖర్‌రెడ్డి కూడా సేద్యంలో సహకారం అందిస్తున్నట్లు వెల్లడించారు. ఆర్మీ నుంచి రిటైర్డ్ అయిన పలు ప్రైవేటు సంస్థల్లో సెక్యూరిటీ గార్డుగా అవకాశం వచ్చింది. అయితే అక్కడ విధులు నచ్చక చేరలేదు. కొన్నాళ్లపాటు ఇసుక రీచ్‌లో ఎస్‌పీఎస్‌ఓగా పని చేశాడు. వారి విధులు తొలగించడంతో తనకు ఇష్టమైన వ్యవసాయం వైపు మళ్లాడు. కుటుంబ సభ్యులు సహకారంతో సీజన్‌కు అనుగుణంగా పంటలు పండిస్తూ మంచి లాభాలు గడిస్తున్నాడు. దేశానికి ఆర్మీ జవానుగా సేవ తనకు గర్వంగా ఉందని, ప్రస్తుతం వ్యవసాయం తనకూ తన కుటుంబానికి తోడుగా ఉండటం ఆనందంగా ఉందని శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు.

(ఆంధ్రజ్యోతి-కనగానపల్లి)



సాగు చేసిన చీనీ, మిరప పంటను చూపుతున్న శ్రీనివాస్‌రెడ్డి



రైలు దొంగల సవాల్

కొత్త ప్లాన్లతో విరుచుకుపడుతున్న వైనం

జీఆర్పీకి తలనొప్పిగా మారిన కట్టడి



గుంతకల్లు ఔటర్‌లో నిలిచిన ప్రశాంతి ఎక్స్‌ప్రెస్

వేసవి వచ్చిందంటే రైళ్లలో రద్దీ విపరీతంగా పెరుగుతుంది. దొంగలు సైతం ప్రతాపం చూపుతారు. ప్రతిసారీ కొత్త కొత్త ప్లాన్లతో ప్రభుత్వ రైల్వే పోలీసు (జీఆర్పీ)లకు దొంగలు సవాల్ విసురుతున్నారు. జీఆర్పీ సిబ్బంది దొంగల పాత ప్లాన్‌ను ఛేదించలోపే.. కొత్త పథకంతో విరుచుకుపడుతున్నారు. దీంతో వేసవి వచ్చిందంటే రైళ్లలో చోరీలు, దోపిడీలను అడ్డుకోవడం సవాల్‌గా మారుతోంది. శ్రీసత్యసాయి, నెల్లూరు జిల్లాలో రైళ్లలో కొన్ని రోజుల క్రితం దోపిడీలు చేశారు. వేసవిలో నెల రోజులు ప్రశాంతంగా గడచిపోవడంతో ఊపిరి పీల్చుకున్న ప్రభుత్వ రైల్వే పోలీసు (జీఆర్పీ) శాఖ వరుసగా రెండు రైలు దోపిడీలతో షాక్‌కు లోనైంది. రైళ్లలో గస్తీ ముమ్మరం చేసింది. సిబ్బంది కొరత నేపథ్యంలో జీఆర్పీ, రైల్వే భద్రతా దళం (ఆర్పీఎఫ్) శాఖలు.. సివిల్ పోలీసులతో కలిసి గస్తీ నిర్వహిస్తున్నాయి. వేసవి పూర్తయ్యే వరకూ ప్రయాణికులు కూడా జాగ్రత్తలు పాటించాలని పోలీసు అధికారులు సూచిస్తున్నారు.

గుంతకల్లు, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): రైళ్లలో చోరీలకు పాల్పడే ముఠాలు ఎప్పటికప్పుడు కొత్త ప్లాన్లు వేస్తున్నాయి. తొలుత జనరల్, స్లీపర్ క్లాస్ ప్రయాణికుల్లా వచ్చి చైన్‌లాగి దోపిడీలు చేసేవారు. ఏడేళ్ల కిందట రైళ్లపైకి రాళ్లు రువ్వి, ప్రయాణికులను భయభ్రాంతులకు లోనుచేసి దోచుకెళ్లారు. ఐదేళ్లుగా ప్రధాన రైల్వే స్టేషన్ల ఔటర్లలో సిగ్నల్‌ను టాంపరింగ్ చేయడం, రైలు నిలిచే చిన్న స్టేషన్లపై కన్నేసి ప్రయాణికులను దోచుకున్నారు. ఇప్పుడు తక్కువ స్టాపింగ్‌లు ఉన్న సుదూర ప్రాంతాలకు వెళ్లే దురంతో ఎక్స్‌ప్రెస్‌లను టార్గెట్‌గా చేసుకుని, సిగ్నల్ టాంపరింగ్‌తో ప్రయాణికుల సొమ్ము దోచారు. ఈ ఏడాది మార్చి 29న శ్రీసత్యసాయి జిల్లాలోని పుట్టపర్తి సమీపాన షిర్డీ-చెన్నై ఎక్స్‌ప్రెస్‌లోకి చొరబడిన దుండగులు.. ప్రయాణికుల మెడల్లోని నెక్లెస్‌లను లాక్కెళ్లారు. ఆ తర్వాత నాలుగు రోజులకే నెల్లూరు జిల్లాలో చండీఘర్-మధురై ఎక్స్‌ప్రెస్‌ను సిగ్నల్ టాంపరింగ్ ద్వారా నిలిపివేసిన దుండగులు ప్రయాణికులను దోచుకున్నారు. మహిళల మెడలోని నగలను లాక్కున్నారు. ఈ రైలు కంటే ముందుగా వచ్చిన హౌరా-బెంగళూరు సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ దుండగుల బారి నుంచి తృటిలో తప్పించుకుంది. ఈ మూడు రైళ్లూ దూర ప్రాంతాలకు వెళ్లే సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌లు కావడం, ప్రధాన స్టేషన్లకు దూరంగా వాటిని నిలిపి దోపిడీలకు పాల్పడడం యాదృచ్ఛికం కాదు. ఇలా.. తక్కువ స్టాపింగ్‌లు ఉన్న సూపర్ ఫాస్ట్ దురంతో ఎక్స్‌ప్రెస్‌లను ఈసారి దొంగలు టార్గెట్ చేశారు.

దొంగల ముఠాలివే..

మహారాష్ట్రకు చెందిన ప్రధి గ్యాంగ్ 2022 సంవత్సరంలో గుత్తి ఔటర్‌లో సిగ్నల్ టాంపరింగ్ చేసి, ప్రయాణికుల బంగారు ఆభరణాలను లాక్కెళ్లింది. అదే సంవత్సరం నెల్లూరు వద్ద సోలాపూర్ గ్యాంగ్.. ప్రయాణికులను దోచుకుంది. 2023లో యూపీకి చెందిన ఉన్నావ్ గ్యాంగ్ గుంతకల్లు వద్ద ప్రయాణికుల బ్యాగ్‌లు, ఆభరణాలు తస్కరించింది. అదే ఏడాది యూపీకి చెందిన గోండా గ్యాంగ్ హిందూపురం వద్ద ప్రయాణికులపై మత్తుమందు ప్రయోగించి, దోచుకుంది. గత సంవత్సరం కదిరి వద్ద యూపీకే చెందిన మీర్జాపూర్ గ్యాంగ్, అనంతపురం వద్ద గోండా గ్యాంగ్ మత్తుమందుతో రైలు ప్రయాణికులను దోచుకున్నాయి. వీటిపై జీఆర్పీ విచారణ చేపట్టి ప్రధి గ్యాంగ్‌కు చెందిన నలుగురిని, సోలాపూర్ ముఠా సభ్యులు ముగ్గురిని, ఉన్నావ్ గ్యాంగ్‌లో ఇద్దరిని, రెండు కేసుల్లో గోండా గ్యాంగ్ సభ్యులు ఆరుగురిని, మీర్జాపూర్ గ్యాంగ్‌కు చెందిన ముగ్గురిని అరెస్టుచేసి, రికవరీలు చేశారు.

నేర చరితులపై ప్రత్యేక దృష్టి

గతంలో రైలు దోపిడీలు, బ్యాగుల చోరీలు, మత్తుమందు ప్రయోగాలు జరిగిన ప్రదేశాలపై జీఆర్పీ, ఆర్పీఎఫ్ ప్రత్యేక దృష్టి సారించాయి. గుత్తి-తాడిపత్రి సెక్షన్‌లో దుండగ ముఠాలు సిగ్నల్ టాంపరింగ్‌తో ప్రయాణికులను దోచుకున్నాయి. గుత్తి-తిరుపతి రూటులోని యర్రగుంట్ల-కమలాపురం సెక్షన్‌లో, గుంతకల్లు-వాడి రూటులో ఆదోని-కొప్పల్ సెక్షన్‌లోనూ, గుంతకల్లు-సికింద్రాబాద్ రూటులో డోన్-కర్నూలు సెక్షన్‌లోనూ, విజయవాడ రూటులో డోన్-నంద్యాల సెక్షన్‌లోనూ దొంగల ముఠాలు బోగీలపైకి రాళ్లు రువ్వి, మహిళల ఆభరణాలను లాక్కెళ్లాయి. గుంతకల్లు, రేణిగుంట, తిరుపతి, పెనుకొండ, గుత్తి స్టేషన్ల వద్ద దొంగలు చైన్ స్నాచింగ్‌లకు పాల్పడ్డారు. అనంతపురం-హిందూపురం, ఒంగోలు-చీరాల, తిరుమల-విజయవాడ సెక్షన్లలో ముఠాలు.. ప్రయాణికులపై మత్తుమందు ప్రయోగాలతో దోచుకున్నాయి. ఈ ప్రాంతాలను లక్ష్యంగా చేసుకుని జీఆర్పీ, ఆర్పీఎఫ్ బలగాలు స్టేషన్లలోనూ, రైళ్లలోనూ భద్రతను పెంచాయి.



పరిష్కారం కాని ఔటర్ సమస్య

రైల్వే శాఖ పెద్ద స్టేషన్ల వద్ద ఔటర్లలో ఎక్స్‌ప్రెస్ రైళ్లను నిలిపేస్తుండడం సమస్యలకు తావిస్తోంది. పెద్ద స్టేషన్లకు సమీపాన దొంగల ముఠాలు సిగ్నల్ వ్యవస్థను దెబ్బతీసి ప్రయాణికులపై దాడులు చేస్తున్నాయి. స్టేషన్‌లో ప్లాట్‌ఫాం ఖాళీలేక బయట కటిక చీకట్లో రైళ్లను నిలిపివేస్తుండటంపై ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గుంతకల్లు జంక్షన్‌లో ఐదు ప్రధాన రూట్లలో రైలు మార్గాలున్నాయి. సాయంత్రం నుంచి ఉదయందాకా రైళ్లను పదుల సంఖ్యలో ఔటర్లలో నిలిపి వేస్తున్నారు. విజయవాడ రూటులో ఒకేసారి ఏకంగా మూడు రైళ్లను సైతం ఆపేస్తున్నారు. తిరుపతి, రాయచూరు, గుత్తి, ధర్మవరం, తదితర రైల్వే కూడళ్లలో సైతం ఇదే పరిస్థితి నెలకొంది. ఈ సమస్యను పరిష్కరించలేని పరిస్థితి నెలకొంది. ఆయా చోట్ల పోలీసు సిబ్బందిని నియమించి, సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

జాగ్రత్తలు తీసుకోవాలి..



దొంగల కదలికలపై గట్టి నిఘా పెట్టాం. చోరీ, దోపిడీ కేసులను ఛేదించాం. రికవరీలు కూడా చేశాం. అయినా.. చోరీలకు ఆస్కారమివ్వకుండా ప్రయాణికులు ముందస్తు జాగ్రత్తలు పాటించాల్సిన అవసరం ఉంది. వేసవిలో కిటికీలు, తలుపుల వద్ద మహిళలు అప్రమత్తంగా ఉండాలి. విలువైన ఆభరణాలు ధరించి ప్రయాణాలు చేయడం మంచిదికాదు. ఔటర్ల వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని రైల్వే శాఖను కో-ఆర్డినేషన్ మీటింగ్‌లో కోరాం. సిబ్బంది కొరతను అధిగమించడానికి సివిల్ పోలీసుల సహకారం తీసుకుంటున్నా. **- రాహుల్ మీనా, జీఆర్పీ ఎస్పీ**

అభివృద్ధికి అడుగులు

- నెరవేరుతున్న హామీలు
- కణేకల్లులో డిగ్రీ కళాశాలకు మోక్షం
- బీటీపీ భూసేకరణకు నిధులు
- చంద్రబాబు ఎన్నికల పర్యటనకు ఏడాది పూర్తి

నిర్మాణ దశలో ఉన్న బాలికల జూనియర్ కళాశాల భవనం



రాయదుర్గం, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): ప్రతిపక్షనేత హోదాలో చంద్రబాబునాయుడు రాయదుర్గం నియోజకవర్గానికి ఇచ్చిన హామీలు ఒక్కొక్కటిగా అభివృద్ధి వైపు అడుగులు పడుతున్నాయి. నియోజకవర్గంలోని కణేకల్లులో గత ఏడాది జన్మదిన వేడుకలను నిర్వహించుకున్నారు. ఏడాది కాలంలో పలు హామీలను నెరవేరుస్తున్నారు. కణేకల్లులో డిగ్రీ కళాశాల ఏర్పాటు చేస్తానని, భైరవానితిప్ప ప్రాజెక్టుకు కృష్ణా జలాలను అందిస్తానని, హంద్రీనీవా 36వ ప్యాకేజీకి మోక్షం కల్పిస్తానని ఇచ్చిన హామీలను ఏడాదిలోనే అమలుకు శ్రీకారం చుట్టారు.

కణేకల్లులో డిగ్రీ కళాశాలకు మోక్షం

ఎన్నికల సభలో భాగంగా చంద్రబాబు కణేకల్లులో డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చా రు. ఇప్పటికే ప్రభుత్వం డిగ్రీ కళాశాలను మంజూరు చేసింది. 2025-26 సంవత్సరంలో కళాశాల ప్రారంభించేందుకు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఐదెకరాల భూసేకరణ కోసం ప్రతిపాదనలు పంపారు. ఈ ఏడాది కళాశాల ప్రారంభించేందుకు తాత్కాలికంగా ఖాళీ ఉన్న ప్రభుత్వ భవనాలను పరిశీలించారు. రాయదుర్గం, ఉరవకొండ పట్టణాలకు వెళ్లి డిగ్రీ విద్యాభ్యాసం సాగించే పరిస్థితుల్లో ఉన్న విద్యార్థులకు ఆ కష్టాలు తొలగిపోతాయి.



కాలువ భూసేకరణకు రూ.64 కోట్లు

జీడిపల్లి నుంచి భైరవానితిప్ప ప్రాజెక్టుకు రెండు టీఎంసీల కృష్ణాజలాలను మళ్లించేందుకు గతంలో తెలుగుదేశం ప్రభుత్వం ఉన్నప్పుడు రూ. 960 కోట్లు మంజూరు చేసింది. వైసీపీ ప్రభుత్వం రివర్స్ టెండరింగ్ పేరుతో పనులు నాన్చుతూ వచ్చింది. ఐదేళ్లలో పనులు ఏ మాత్రం ముందుకు సాగలేదు. ప్రస్తుత ప్రభుత్వం 2025-26 బడ్జెట్‌లో కాలువల తవ్వకాల భూసేకరణకు రూ. 64 కోట్లు నిధులను మంజూరు చేసింది. దీంతో పనులు మరింత వేగం అందుకోనున్నాయి. ఏళ్ల తరబడి కృష్ణాజలాల కోసం ఆ ప్రాంత ప్రజలు నిరీక్షిస్తున్నారు. నిధుల కేటాయింపుతో అభివృద్ధికి అడుగులు పడ్డాయి.

36వ ప్యాకేజీ పనుల్లో కదలిక

హంద్రీనీవా నుంచి సాగునీరు అందించేందుకు 36వ ప్యాకేజీ పనులను పదేళ్ల క్రితం మంజూరు చేశారు. ఇప్పటి వరకు భూసేకరణకు సంబంధించిన పరిహారం ఇవ్వలేదు. ఏడాది క్రితం కణేకల్లు బహిరంగ సభలో చంద్రబాబు ప్రకటించిన విధంగా భూసేకరణలో భూములు కోల్పోయిన రైతాంగానికి పరిహారం సొమ్మును ప్రభుత్వం మంజూరు చేసింది. హంద్రీనీవాలోని 36వ ప్యాకేజీ పనుల్లో కాలువ తవ్వకాలు చేశారు. భూమి కోల్పోయిన రైతులకు ఏళ్లతరబడి పరిహారం అందలేదు. ఈ నేపథ్యంలో చంద్రబాబు పూర్తిస్థాయిలో పరిహారం అందించడంతో మాట నెరవేర్చుకున్నారని అన్నదాతలు కొనియాడుతున్నారు.

హెచ్చెల్సీలో జరుగుతున్న పనులు

బాలికల జూనియర్ కళాశాలకు శాశ్వత భవనం

రాయదుర్గంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో పెద్ద ఎత్తున చేరుతుండడంతో ప్రాధాన్యత సంతరించకుంది. గత టీడీపీ హయాంలో బాలికల జూనియర్ కళాశాలను మంజూరు చేసి భవనాల కోసం రూ.52 లక్షలు కేటాయించారు. వైసీపీ హయాంలో పనులు ఆగిపోయాయి. ప్రస్తుత ప్రభుత్వం వచ్చాక పనులు వేగవంతంగా సాగుతున్నాయి. నిర్మాణ పనులు చివరి దశకు చేరుకున్నాయి. గుమ్మఘట్టలో బాలికల ఆశ్రమ కళాశాలకు సంబంధించి ఆగిపోయిన పనులను పునః ప్రారంభించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంది.

రూ. 32 కోట్లతో హెచ్చెల్సీకి ఉపశమనం

తుంగభద్ర ఎగువకాలువ ఆధునికీకరణ పనులు పూర్తిగా ఆగిపోయాయి. అధ్వాన్నస్థితికి చేరుకున్న కాలువను మరమ్మతులు చేయించడంలో వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం చేసింది. ప్రస్తుత ప్రభుత్వం తక్షణమే మరమ్మతులకు రూ.32 కోట్లను మంజూరు చేసింది. ఏడాది క్రితం చంద్రబాబు ఇచ్చిన హామీ ప్రకారం ఆధునికీకరణ పరిశీలనలో ఉన్నప్పటికీ నీటి సరఫరాకు అంతరాయంగా ఉన్న చోట మరమ్మతులకు నిధులు మంజూరు చేసింది. దీంతో హెచ్చెల్సీకి ఐదేళ్ల వైసీపీ శాపం నుంచి విముక్తి కలిగి ఉపశమనం లభించినట్లయింది.

రేపట్నుంచి మెడికల్ సర్టిఫికెట్ల పరిశీలన

ఉపాధ్యాయ బదిలీల నేపథ్యంలో.. జిల్లా ఆస్పత్రిలో ప్రత్యేక కౌంటర్లు


చర్చిస్తున్న డాక్టర్ వెంకటేశ్వరరావు, మల్లికార్జున రెడ్డి

అనంతపురం టౌన్, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ బదిలీల కోసం మెడికల్ సర్టిఫికెట్ల వెరిఫికేషన్ జిల్లా సర్వజన వైద్యశాలలో ఈ నెల 24 నుంచి 26వ తేదీ వరకు జరుగుతుందని సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వరరావు తెలిపారు. ఆయా తేదీలలో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకూ వైద్య పరీక్షలు నిర్వహిస్తామని తెలిపారు. 24వ తేదీన అనంతపురం జిల్లా ఉపాధ్యాయులకు 25న శ్రీసత్యసాయి జిల్లా ఉపాధ్యాయులు వెరిఫికేషన్ కోసం రావాలని సూచించారు. ఆ రెండు తేదీల్లో రాలేని రెండు జిల్లాల ఉపాధ్యాయులు 26వ తేదీన రావాలని సూచించారు. పాత మెడికల్ బోర్డు సర్టిఫికెట్లు తాజా మెడికల్ రిపోర్టులు, రోగులను తీసుకుని రావాల్సి ఉంటుందని తెలిపారు. రిజిస్ట్రేషన్ కోసం ఆస్పత్రిలో ఐదు ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. డీఈఐసీ లో క్యాన్సర్ బాధితులకు, బర్న్స్ వార్డులో పీడియాట్రిక్స్, సైకియాట్రిక్స్, ఆర్థోపెడిక్స్ బాధితులకు, సైకియాట్రీ వార్డులో సూపర్‌స్పెషాలిటీ స్పెషలిస్టులు, మెడికల్ సంబంధిత బాధితులకు ఆప్తమాలజీ వార్డులో దృశ్యలోపం ఉన్న వారికి, ఈఎన్‌టీవార్డులో వినికిడి లోపం ఉన్నవారికి వైద్య పరీక్షలు నిర్వహిస్తామని తెలిపారు.

ఏర్పాట్లపై సమీక్ష

జిల్లా ఆస్పత్రిలో శిబిరాలను ఏర్పాటు చేసి, వైద్య నిర్ధారణ పరీక్షలు నిర్వహించాలని విద్యాశాఖ కమిషనర్, డీఎంఈ నుంచి ఆస్పత్రికి ఉత్తర్వులు వచ్చాయి. దీంతో సూపరింటెండెంట్ డాక్టరు వెంకటేశ్వరరావు, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ మల్లికార్జున రెడ్డి మంగళవారం సమావేశమై ఈ అంశం గురించి చర్చించారు. డీఈఓ ప్రసాద్‌బాబు, డిప్యూటీ ఆర్ఎంఓ హేమలత, వైద్య సిబ్బందితో ఏర్పాట్ల గురించి సమీక్షించారు. శిబిరానికి రెండు వేల మందిదాకా ఉపాధ్యాయులు వచ్చే అవకాశం ఉందని డీఈఓ తెలిపారు.

కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబులు

17వ రోజుకు శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం కార్మికుల సమ్మె

కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన


కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న నాయకులు, కార్మికులు

అనంతపురం న్యూటౌన్ ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబులు డిమాండ్ చేశారు. శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం కార్మికులు తమ డిమాండ్ల సాధన కోసం విధులను బహిష్కరించి 17రోజులుగా నిరవధిక సమ్మెకు దిగారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ప్రధాన కూడళ్లలో కార్మికులు, యూనియన్ నాయకులు బైక్‌ర్యాలీ చేపట్టి నిరసన తెలిపారు. స్థానిక క్లాక్‌టవర్ నుంచి ప్రారంభించిన బైక్ ర్యాలీ ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ కార్యాలయం వరకు కొనసాగింది. అక్కడ ధర్నా నిర్వహించి పెద్ద ఎత్తున నినాదాలతో హోరెత్తించారు. అనంతరం కార్మికులు తిరిగి ర్యాలీగా కలెక్టర్ కార్యాలయం వరకు వెళ్లి నిరసన కొనసాగించారు. కొందరు యూనియన్ నాయకులు కార్యాలయంలోకి వెళ్లి కలెక్టర్ వినోద్‌కుమార్‌కు సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందించారు. కార్మికులు తమ న్యాయమైన డిమాండ్ల సాధనకు విధులను బహిష్కరించి సమ్మెకు దిగాల్సిరావడం బాధాకరమని అన్నారు. 17 రోజులుగా సమ్మె చేస్తున్నా.. సంబంధిత అధికారుల్లో ఏ మాత్రం చలనం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే కార్మికుల బకాయి వేతనం మంజూరు చేసి పీఎఫ్, ఈఎస్ఐ సొమ్ము జమ చేసేలా చూడాలని కోరారు. స్పందించిన కలెక్టర్ సమస్య పరిష్కరించేలా చూస్తామని హామీ ఇచ్చినట్లు యూనియన్ నాయకులు తెలిపారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి నల్లప్ప, వివిధ వామపక్ష సంఘాల నాయకులు రాజారెడ్డి, ఏసురత్నం, నాగేంద్రకుమార్, చంద్రశేఖర్‌రెడ్డి, రాయుడు, కృష్ణమూర్తి, నాగమణి, రామాంజనేయులు, ఎర్రిస్వామి, రాము, వన్నూరప్ప, అశోక్, నరేష్ పాల్గొన్నారు.

పలువురు న్యాయాధికారుల బదిలీ

అనంతపురం క్రైం, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాల పరిధిలో పలువురు న్యాయాధికారులు బదిలీ అయ్యారు. అనంతపురం సివిల్ న్యాయాధికారి ప్రతిభను కడప జిల్లా ప్రొద్దుటూరుకు, మొబైల్ కోర్టు న్యాయాధికారి సుజిన్‌కుమార్‌ను గుంటూరు జిల్లా సత్తెనపల్లి అదనపు సివిల్ న్యాయాధికారిగా, పెనుకొండ సివిల్ న్యాయాధికారి రమ్యసాయిని చిత్తూరు జిల్లా పుత్తూరుకు, హిందూపురం సివిల్ న్యాయాధికారి రాజ్యలక్ష్మిని పశ్చిమగోదావరి జిల్లా నరసాపూర్‌కు, కదిరి సివిల్ న్యాయాధికారి ప్రతిమను కర్నూలు జిల్లా డోన్‌కు, కదిరి సివిల్ న్యాయాధికారి మీనాక్షి సుందరిని నెల్లూరు జిల్లా గూడూరుకు, కళ్యాణదుర్గం సివిల్ న్యాయాధికారి సుభాన్‌ను చిత్తూరు జిల్లా మదనపల్లెకు, తాడిపత్రి సివిల్ న్యాయాధికారి క్రిష్ణవేణిని పశ్చిమగోదావరి జిల్లా తణుకుకు, పెనుకొండ సివిల్ న్యాయాధికారి ముజీబ్ పసపల సయ్యద్‌ను పుట్టపర్తికి, పుట్టపర్తి సివిల్ న్యాయాధికారి రాకేష్‌ను పెనుకొండకు బదిలీ చేశారు. తూర్పు గోదావరి జిల్లా ప్రత్తిపాడు సివిల్ న్యాయాధికారి భాను రాయదుర్గానికి, కడప సివిల్ న్యాయాధికారి నందిని పెనుకొండకు, కడప జిల్లా ప్రొద్దుటూరు సివిల్ న్యాయాధికారి అనిల్‌కుమార్ గుంతకల్లుకు, నెల్లూరు జిల్లా గూడూరు సివిల్ న్యాయాధికారి లోకనాథమ్ కదిరికి బదిలీ అయ్యారు.

డైట్ సెట్‌కు దరఖాస్తు చేసుకోండి

బుక్కపట్నం, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి అనంతపురం జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు జిల్లా విద్యాశిక్షణ సంస్థ (డైట్)లో ప్రవేశాల కోసం అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని బుక్కపట్నం డైట్ ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ.. ఈనెల 22 నుంచి మే 8వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. హాల్‌టికెట్లను ఆన్‌లైన్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవచ్చన్నారు. దరఖాస్తులను ఆన్‌లైన్ మాత్ర మే నమోదు చేసుకోవాలని, ప్రత్యక్షంగా స్వీకరించబోమన్నారు.

అస్తమయం



హిందూపురం

ఎస్‌డీజీఎస్ కళాశాల క్రీడా మైదానంలో పచ్చని కానుగచెట్టు అది. సమయం మంగళవారం సాయంత్రం 5.40 అవుతోంది. ఓ తొండ ఆ చెట్టుపై సేదదీరుతోంది. నిశ్శబ్దంగా ముంచుకొస్తున్న మృత్యువును అది గమనించలేదు. అదే చెట్టుపై దాగి ఉన్న పసురు పాము నెమ్మదిగా తొండ వైపు వెళ్లి.. అమాంతం దాని గొంతు పట్టుకుంది. విడిపించుకునేందుకు గంటకు పైగా తొండ పోరాడింది. దాని సత్తువ సన్నగిల్లేదాకా పాము ఓపికగా, పట్టు సడలకుండా చూసుకుంది. పడమటి ఆకాశం నుంచి అంతసేపూ చోద్యం చూసిన సూరీడు.. సాయంత్రం 6.34 గంటలకు విధి నిర్వహణ ముగించి విశ్రాంతిలోకి వెళ్లిపోయాడు. చీకట్లు కమ్ముకునే వేళ.. కొన ఊపిరితో ఉన్న తొండను నెమ్మదిగా మింగేయడం ప్రారంభించిది పాము. వాకింగ్‌కు వచ్చినవారు ఆ పని మానేసి.. పచ్చని చెట్టుపై ప్రకృతి ధర్మాన్ని కళ్లారా చూసి.. వేదనాభరిత హృదయంతో అక్కడి నుంచి వెళ్లిపోయారు.

-ఆంధ్రజ్యోతి, హిందూపురం



సత్యసాయి శతజయంతికి ముందస్తు ఏర్పాట్లు

వెంటనే పనులు ప్రారంభించాలి

అధికారుల సమీక్షలో కలెక్టర్ టీఎస్ చేతన్


అధికారుల సమావేశంలో పాల్గొన్న కలెక్టర్, జాయింట్ కలెక్టర్

పుట్టపర్తిటౌన్, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): ఈ యేడాది నవంబరులో నిర్వహించే సత్యసాయి బాబా శతజయంతి ఉత్సవాలకు అన్నిశాఖల అధికారులు ముందస్తు ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ టీఎస్ చేతన్ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జాయింట్ కలెక్టర్ అభిషేక్‌కుమార్, సత్యసాయి ట్రస్టు సభ్యులతో కలిసి శతజయంతి ఏర్పాట్లపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. సత్యసాయి శతజయంతికి ప్రధాని నరేంద్రమోదీతోపాటు, దేశవిదేశాలకు చెందిన అనేకమంది ప్రముఖులు పుట్టపర్తి రానున్నట్లు తెలిపారు. పది లక్షల మందికిపైగా భక్తులు వేడుకలకు వచ్చే అవకాశం ఉందన్నారు. ప్రముఖులకు అవసరమైన ప్రత్యేక హెలిప్యాడ్లు ఏర్పాటు చేయాలని, భద్రతాపరమైన ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. తాత్కాలిక బస్ స్టేషన్లు, వసతి గృహాలు, మొబైల్ మరుదొడ్లకు ఇప్పటి నుంచే పనులు మొదలుపెట్టాలని అన్నారు. చిత్రావతి నది సుందరీకరణ పనులు వెంటనే ప్రారంభించాలని తెలిపారు. కార్యక్రమంలో సత్యసాయి ట్రస్టు సభ్యులు చలం, రోమాల్, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, ఆర్డీఓ సువర్ణ, డీపీఓ సమత, దేవదాయ, పోలీస్, మున్సిపల్, తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

సత్యసాయి ప్రేమతత్వం అనంతం

ప్రపంచానికి అందించండి

సేవాసంస్థల జాతీయ అధ్యక్షుడు నిమీష్‌పాండే

రేపు సత్యసాయి ఆరాధనోత్సవాలు


ప్రసంగిస్తున్న నిమీష్‌పాండే

పుట్టపర్తి, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): సత్యసాయిబాబా ప్రేమతత్వం అనంతమైనదని, దానిని భవిష్యత్ తరాలకు అందించాల్సిన బాధ్యత సాయియూత్‌దేనని సత్యసాయి సేవాసంస్థల జాతీయ అధ్యక్షుడు నిమీష్ పాండే పేర్కొన్నారు. మంగళవారం ప్రశాంతి నిలయంలోని సాయికుల్వంతులో సత్యసాయిసేవల ప్రచారంపై రెండు రోజులు సదస్సును చేపట్టారు. సత్యసాయి గ్లోబల్ కౌన్సిల్ ఛైర్మన్ చక్రవర్తి జ్యోతి ప్రజ్వలన చేసి సదస్సును ప్రారంభించారు. ఈ సందర్భంగా నిమీష్‌పాండే మాట్లాడుతూ.. సత్యసాయిబాబా ప్రేమతత్వమనే మిషన్‌ను ప్రారంభించారని, దానిని సాయియూత్ విశ్వవ్యాప్తం చేయాలని పిలుపునిచ్చారు. నేటి యువతకు ప్రశాంతత కొరవడిందన్నారు. మనిషి ఎంత ఎత్తుకు ఎదిగినా, పదవులు అధిష్ఠించినా ప్రశాంతత, విలువలు లేకపోతే ఆ జీవితం వ్యర్థం అన్నారు. అనంతరం మలేషియా ప్రతినిధి జగదీశ్ ప్రసంగించారు. గురువారం నిర్వహించే సత్యసాయి ఆరాధనోత్సవాలకు ట్రస్టు ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టారు. ఉదయం 10గంటలకు సత్యసాయి హిల్‌వ్యూస్టేడియంలో భక్తులకు వస్త్రదానం, నారాయణసేవ అందించనున్నారు. కార్యక్రమంలో సత్యసాయి సెంట్రల్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్, సేవాదళ్ కోఆర్డినేటర్ కోటేశ్వరరావు, సేవాదళ్ ప్రతినిధులు లక్ష్మణరావు, చలం పాల్గొన్నారు.

నాటుసారాను నియంత్రించండి

సారా రహిత జిల్లాగా తీర్చిదిద్దాలి

ఎక్సైజ్‌శాఖ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య


సమీక్ష నిర్వహిస్తున్న ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య

పుట్టపర్తి రూరల్, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): జిల్లాలో నాటుసారాను నియంత్రించాలని, అమ్మకందారులపై ప్రత్యేక నిఘా ఉంచి కేసులు నమోదు చేయాలని ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ ఉమ్మడి జిల్లా డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య ఆదేశించారు. మంగళవారం పుట్టపర్తిలోని ఆ శాఖ కార్యాలయంలో ఎక్సైజ్ ఎస్ఐలు, సీఐలతో సమీక్షాసమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీసీ నాగమద్దయ్య మాట్లాడుతూ.. ఏ, బీ, సీ గ్రామాల్లో నాటుసారా తయారీ, అమ్మకందారులపై నిఘా పెంచాలని, పాత నేరస్థులు, అనుమానితులను గుర్తించి బైండోవర్ చేయాలని ఆదేశించారు. నాటు సారా కేసుల్లో పట్టుబడితే లక్ష రూపాయల జరిమానా చెల్లించేలా కఠినంగా వ్యవహరించాలని తెలిపారు. పీడీ యాక్ట్ ప్రయోగించేందుకు ప్రతిపాదించాలని అన్నారు. మద్యం షాపుల్లో నిబంధనలు ప్రకారం అమ్మకాలు జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ అధికారి గోవిందనాయక్, సూపరింటెండెంట్ నరసింహులు, ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి మొక్కా బతకాలి: డీఎఫ్ఓ


పామిడిలో మొక్కలను పరిశీలిస్తున్న విఘ్నేష్

పామిడి, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): నర్సరీలలో నాటే ప్రతి మొక్క బతకాలని జిల్లా అటవీశాఖ అధికారి(డీఎఫ్ఓ) విఘ్నేష్ పేర్కొన్నారు. స్థానిక అటవీశాఖ విశ్రాంతి భవనం వద్ద ఉన్న నర్సరీలను మంగళవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఏయే రకమైన మొక్కలు ఉన్నాయని ఆరా తీశారు. వేసవికాలంలో మొక్కలు ఎండిపోకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో రేంజర్ మధుబాబు, డిప్యూటీ రేంజర్ దీప, బీట్ ఆఫీసర్ చంద్ర తదితరులు పాల్గొన్నారు.

బీపీఈడీ ఫలితాలు విడుదల

అనంతపురం సెంట్రల్, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): ఎస్కేయూ ఆధ్వర్యంలో నిర్వహించిన బ్యాచులర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్(బీపీఈడీ) పరీక్షల ఫలితాలను వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ అనిత మంగళవారం తన కార్యాలయంలో విడుదల చేశారు. నాలుగో సెమిస్టర్ పరీక్షలకు 33 మంది విద్యార్థులు హాజరు కాగా 29 మంది ఉత్తీర్ణులయ్యారని పేర్కొన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ రమేష్‌బాబు, పరీక్షల నిర్వాహక విభాగాధికారులు ప్రొఫెసర్ జీవీ రమణ, డాక్టర్ లోకేష్ తదితరులు పాల్గొన్నారు.


ఫలితాలను విడుదల చేస్తున్న వీసీ అనిత

విద్యుదాఘాతంతో రైతు మృతి

బ్రహ్మసముద్రం, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని కన్నేపల్లి గ్రామానికి చెందిన రైతు బోయ మాలింగ(35) విద్యుదాఘాతంతో మంగళవారం మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు పొలంలో పంటకు నీరు పెట్టేందుకు మోటార్ వద్దకు మాలింగ వెళ్లాడు. మోటారు రివర్స్ ఆడుతుండటంతో స్టార్టర్‌లో కరెంటు వైర్లు మార్చి మోటారు ఆన్ చేయగా షాక్ తగలడంతో అక్కడికక్కడే మృతి చెందారు. చుట్టుపక్కల రైతులు గమనించి వెళ్లేసరికే మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

చీనీ టన్ను రూ.21వేలు

అనంతపురం రూరల్, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో మంగళవారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.21,810 పలికినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి గోవిందు తెలిపారు. కనిష్ఠంగా రూ.4వేలు, సరాసరి రూ.14వేలతో అమ్ముడుపోయినట్లు తెలిపారు.

ఉమ్మడి జిల్లాను సోలార్ హబ్‌గా మార్చొద్దు

సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జగదీశ్

గుంతకల్లు, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి అనంతపురం జిల్లాను సోలార్ హబ్‌గా మారిస్తే పంట పొలాలు కాంక్రీటు, సోలార్ ప్యానళ్లమయంగా మారి రైతులు నష్టపోతారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు డి. జగదీశ్ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. మడకశిర పర్యటనకు వచ్చిన విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఉమ్మడి జిల్లాను సోలార్‌హబ్‌గా మారుస్తామంటూ ప్రకటించడంపై సందేహాలను వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఉమ్మడి జిల్లాను హార్టికల్చర్‌హబ్‌గా మారుస్తానని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. గత ఎంపీ రంగయ్య ఉమ్మడి జిల్లాలో పండ్ల ఎగుమతికి కిసాన్ రైళ్లను ఏర్పాటు చేయించారని.. ప్రస్తుత ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ అవసరమైతే కార్గో విమానాశ్రయాన్ని ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారని పేర్కొన్నారు. కుప్పంకు నీటిని తీసుకెళ్లడానికే హంద్రీనీవాకు లైనింగ్ చేస్తున్నారని ఆరోపించారు. అదే జరిగితే కర్నూలు, అనంతపురం, సత్యసాయి జిల్లాల్లో భూగర్భ జలాలు అడుగంటిపోతాయన్నారు. సమావేశంలో సీపీఐ నాయకులు గోవిందు, వీరభద్రస్వామి, మహేశ్, గోపీనాథ్, మహమ్మద్ గౌస్, రాయల్ రాము పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జగదీశ్

రైతులకు చేదోడుగా మహిళా సంఘాలు

పంట దిగుబడి, గిట్టుబాట ధర కల్పించడమే లక్ష్యం

డీఆర్‌డీఏ పీడీ ఈశ్వరయ్య


మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ ఈశ్వరయ్య

అనంతపురం క్లాక్‌టవర్, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): పంట దిగుబడి, గిట్టుబాటు ధర కల్పించడమే లక్ష్యంగా స్వయం సహాయక మహిళా సంఘాలు రైతన్నలకు చేదోడుగా నిలుస్తాయని డీఆర్‌డీఏ-వెలుగు పీడీ ఈశ్వరయ్య తెలిపారు. మంగళవారం స్థానిక ప్రశాంతి జిల్లా సమాఖ్య కార్యాలయంలో సమీకృత వ్యవసాయంపై స్వయం సహాయక మహిళా సంఘాలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం రైతులను ప్రోత్సహించి, నష్టనివారణకు సమీకృత వ్యవసాయాన్ని ప్రవేశపెట్టిందని తెలిపారు. ఇందులో స్వయం సహాయక సంఘాల మహిళలను భాగస్వాములు చేయడం శుభపరిణామం అన్నారు. జిల్లాలో ఉరవకొండ మండలం పెద్ద కౌకుంట్ల, గుత్తి మండలం జక్కలచెరువును సమీకృత వ్యవసాయానికి పైలెట్ ప్రాజెక్టులుగా ఎంపిక చేసిందన్నారు. చిన్న, సన్నకారు రైతులకు ఆధునిక వ్యవసాయ పద్ధతులు, సేద్యంలో సాంకేతికతను జోడించడం, బహుపంటల విధానం, దిగుబడి పెంచడం, పెట్టుబడిని తగ్గించడం, ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించి చైతన్యం చేయడానికి స్వయం సహాయక సంఘాల మహిళలను సీఆర్‌పీలుగా ఎంపిక చేశామని తెలిపారు. అనంతరం జిల్లా సమాఖ్య సమావేశంలో.. స్వయం సహాయక మహిళా సంఘాల సంస్థాగత నిర్మాణం, ఆర్థిక లావాదేవీల నిర్వహణ అత్యంత పారదర్శకంగా, రికార్డుల రూపంలో ఉండాలని సూచించారు. కార్యక్రమంలో డీపీఎంలు గంగాధర్, సత్యనారాయణ, ఏపీఎంలు అనిత, శివయ్య, ప్రశాంతి జిల్లా సమాఖ్య అధ్యక్ష, కార్యదర్శులు సుశీలమ్మ, రాధమ్మ పాల్గొన్నారు.

లైనింగ్ పనులు నిలిపివేయాలి

హంద్రీనీవా కాలువను వెడల్పు చేయాలి

అఖిలభారత రైతు-వ్యవసాయ కూలీ సంఘం


హంద్రీనీవా ఎస్ఈకి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

అనంతపురం క్లాక్‌టవర్, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): కరువు జిల్లాకు ప్రధాన నీటి వనరుగా ఉన్న హంద్రీనీవా కాలువ లైనింగ్ పనులు నిలిపివేసి...వెడల్పు పనులు వెంటనే ప్రారంభించాలని అఖిలభారత రైతు-వ్యవసాయ కూలీ సంఘం రాష్ట్ర కార్యదర్శి నాగముత్యాలు డిమాండ్ చేశారు. మంగళవారం జలవనరుల శాఖ కార్యాలయంలో హంద్రీనీవా సుజల స్రవంతి పథకం ఎస్ఈ రాజా స్వరూప్‌కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాగముత్యాలు మాట్లాడుతూ.. రాయలసీమలోని ఉమ్మడి అనంతపురం జిల్లా కరువుతో సహవాసం చేస్తోందని అన్నారు. రైతులు వేల అడుగులు బోర్లు వేసినా నీటి జాడ కనపడక అప్పుల ఊబిలో కూరుకుపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. అప్పులు తీర్చలేక, పంటలు పండక ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని అన్నారు. కరువు నుంచి విముక్తి కల్పించడానికి ఉన్న ఏకైక మార్గం హంద్రీనీవా కాలువ అన్నారు. ఈ కాలువకు సిమెంట్ కాంక్రీట్ లైనింగ్ చేస్తే భూగర్భజలాలు మరింత అడుగంటిపోయే ప్రమాదం ఉందన్నారు. ఈ నేపథ్యంలో లైనింగ్ పనులు నిలుపుదల చేసి, వెంటనే వెడల్పు పనులు ప్రారంభించాలని కోరారు. కాలవ పరివాహక ప్రాంతాల్లో భూగర్భజలాలు పెరిగి పండ్లతోటలను సాగుచేస్తున్న రైతులకు లైనింగ్‌తో తీవ్రనష్టం జరుగుతుందన్నారు. దీనికి ఎస్ఈ స్పందిస్తూ ఇది ప్రభుత్వ నిర్ణయమని, రైతులకు ఎలాంటి ఇబ్బంది రాదని...ఇంకా మేలు జరుగుతుందని తెలిపారు.

నేటి నుంచి డిగ్రీ పరీక్షలు

- ఏర్పాట్లు పూర్తి చేసిన ఎస్కేయూ అధికారులు

అనంతపురం సెంట్రల్, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): ఎస్కేయూ ఆధ్వర్యంలో గురువారం నుంచి నిర్వహించనున్న డిగ్రీ పరీక్షలకు సర్వం సిద్ధం చేశారు. పరీక్షా కేంద్రాల ఏర్పాటు, హాల్‌టికెట్ల జారీ, ఇన్విజిలేటర్ల కేటాయింపు, జవాబు పత్రాలను కేంద్రాలకు తరలింపు ఇలా అన్ని ప్రక్రియలను సకాలంలో పూర్తిచేశామని కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ లోకేష్ వివరించారు. డిగ్రీ ద్వితీయ, నాల్గవ సెమిస్టర్ రెగ్యులర్, సప్లిమెంటరీతోపాటు ఆరో సెమిస్టర్, మెగా సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఉమ్మడి జిల్లాలో 58 పరీక్షా కేంద్రాల్లో దాదాపు 22వేల మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని వివరించారు. మెగా సప్లిమెంటరీ విద్యార్థులు వారి హాల్‌టికెట్స్‌ను కళాశాలలో తీసుకోవాలని సూచించారు.

న్యూస్ బాక్స్

గ్రామదేవతలకు ఘనంగా బోనాలు


అలంకరణలో పోతలయ్య స్వామి

కనగానపల్లి, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన కనగానపల్లిలో మంగళవారం పోతలయ్యస్వామి, సల్లాపురమ్మ గ్రామ దేవతలకు ఘనంగా బోనాలు సమర్పించారు. గ్రామస్థులు బోనాలు ఎత్తుకుని ఊరేగింపుగా వెళ్లి పోతలయ్యకు, సల్లాపురమ్మకు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పోతలయ్యస్వామికి జంతుబలులు సమర్పించి మొక్కులు చెల్లించారు.

● రామగిరి: మండలంలోని కొత్తదాగికుంట, పెదయ్యగారికొట్టాల గ్రామాల్లో గ్రామదేవతలకు మంగళవారం జ్యోతులు, బోనాలతో మొక్కులు తీర్చుకున్నారు. కొత్తగాది కుంటలో ముత్యాలమ్మ, పెద్దమ్మ దేవతలకు పెదయ్యగారికొట్టాలలో ఆంజనేయ స్వామి, చుక్కలమ్మకు జ్యోతులు, బోనాలు సమర్పించారు.

26న అరుణాచలేశ్వరుడి పూజ


పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఎంపీ అంబికా తదితరులు

అనంతపురం కల్చరల్, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): కోట్లాది మంది భక్తుల ఆరాధ్య దైవం అరుణాచలేశ్వరుడి అనుష్ఠానం కార్యక్రమాన్ని అనంతపురంలో నిర్వహించనుండడం ఎంతో అదృష్టమని ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. సాయి ట్రస్టు ఆధ్వర్యంలో నగరంలో నిర్వహించనున్న అరుణాచలేశ్వరుడి పూజకు సంబంధించిన పోస్టర్లను మంగళవారం ఎంపీ చేతులమీదుగా నగర శివారులోని ఆయన క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంపి మాట్లాడుతూ... సాయి ట్రస్టు ఆధ్వర్యంలో నగరంలోనే అరుణాచలం ఉత్సవ మూర్తులకు అక్కడి పూజారులచే పూజలు నిర్వహిస్తారని తెలిపారు. సాయి ట్రస్టు అధ్యక్షుడు విజయసాయికుమార్ మాట్లాడుతూ... ఈనెల 26న ఉదయం 7 నుంచి రాత్రి 9 గంటల వరకు జిల్లా కేంద్రం లోని మూడోరోడ్డులో ఉన్న జీఆర్ ఫంక్షన్ హాల్ 1వ గేట్‌లో అరు ణాచలేశ్వరుడి పూజలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మాజీ మే యర్ మదమంచి స్వరూప, సాయి ట్రస్టు సభ్యులు రాఘవేంద్ర, నారాయణనాయక్, మంజునాథ్ తదితరులు పాల్గొన్నారు.

అక్కల్‌కోట మహరాజ్ ఆరాధనోత్సవాలకు తరలిరండి

అనంతపురం కల్చరల్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక హెచ్చెల్సీ కాలనీలోని వలి స్వామి ఆశ్రమంలో ఈనెల 26వ తేదీన నిర్వహించనున్న అక్కల్‌కోట మహరాజ్ స్వామి 147వ ఆరాధనోత్సవాలను విజయవంతం చేయాలని ఆశ్రమ కమిటీ నిర్వాహకుడు విజయ్‌కుమార్ పిలుపునిచ్చారు. మంగళవారం ఆశ్రమ ఆవరణలో ఆరాధనోత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరించారు. భక్తులు విరివిగా హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో కొండారెడ్డి, నాగప్రసాద్, ఆనంద్, సువర్ణ, మల్లికార్జున, రఘునాథశర్మ తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలి : ఏడీఏ

అనంతపురం రూరల్, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): రైతులు ప్లాస్టిక్‌ను, రసాయన పురుగు మందుల వాడకాన్ని తగ్గించాలని అనంతపురం డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు ఎం. రవి అన్నారు. ప్రపంచ భూమి దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం భూమి పునరుద్ధరణ, పర్యావరణ పరిరక్షణ అనే అంశాలపై మండలంలోని కక్కలపల్లిలో రైతులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ప్లాస్టిక్ కాలుష్యాన్ని తగ్గించేందుకు రైతులు చర్యలు చేపట్టాలని తెలియజేశారు. పట్టణీకరణ, కర్మాగారాల ఏర్పాటు కోసం అడవులు అదృశ్యమవుతున్నాయన్నారు. అందుచేత రైతులు చెట్లను పెంచాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఓ శశికళ తదితరులు పాల్గొన్నారు.

చిన్మయ్‌నగర్‌లో నాకాబందీ

రాప్తాడు, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రసన్నాయపల్లి పంచాయతీ పరిధిలోని చిన్మయ్‌నగర్‌లో మంగళవారం రాప్తాడు సీఐ శ్రీహర్ష సిబ్బందితో కలిసి నాకాబందీ నిర్వహించారు. అనుమానితుల ఇళ్ల వద్దకు వెళ్లి తనిఖీలు చేశారు. ఘర్షణలకు పాల్పడకుండా ప్రశాంతంగా జీవించాలని ప్రజలకు తెలిపారు. అనంతరం రాప్తాడు జాతీయ రహదారిలో అధిక సంఖ్యలో ప్రయాణికులతో వెళుతున్న వాహనాలను నిలిపి సీజ్ చేశారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

హాస్టల్ కోసం దరఖాస్తు చేసుకోండి

శింగనమల, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు అనుబంధంగా ఉన్న కేజీబీవీ టైప్-4 హాస్టల్‌లో ప్రవేశానికి అర్హులైన విద్యార్థినులు దరఖాస్తు చేసుకోవాలని ఎంఈఓ నరసింహరాజు ఒక ప్రకటనలో తెలిపారు. శింగనమల లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుతున్న విద్యార్థినులు అర్హులని ఆయన తెలిపారు.

ఖాళీ పోస్టులకు....

స్థానిక కేజీబీవీ టైప్-3 హాస్టల్‌లో ఖాళీగా ఉన్న పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని ఎంఈఓ నరసింహరాజు తెలిపారు. కేజీబీవీ-3లో హెడ్‌కుక్-1, అసిస్టెంట్‌కుక్-3 వాచ్‌మన్-1 పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. అలాగే టైప్-4లో చౌకీదార్-1, హెడ్ కుక్-1 అసిస్టెంట్‌కుక్-1 ఖాళీగా ఉన్నాయని తెలిపారు. మొత్తం తొమ్మిది పోస్టులకు అర్హులైన మహిళలు ఈనెల 30లోగా ఎంఈఓ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

ఘనంగా ఎరా స్కూల్ వార్షికోత్సవం


వార్షికోత్సవంలో పాల్గొన్న స్కూల్ యాజమాన్యం తదితరులు

అనంతపురం రూరల్, ఏప్రిల్22(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాచనపల్లి సమీపంలో ఉన్న ఎరా ఇంటర్నేషనల్ స్కూల్ వార్షికోత్సవం మంగళవారం ఘనంగా జరిగింది. ముఖ్య అతిథులుగా విద్యాసంస్థల అధినేత చిరంజీవిరెడ్డి, పాఠశాల చైర్మన్ అరుణ్‌కుమార్‌రెడ్డి, డైరెక్టర్ వినూత్న, ప్రిన్సిపాల్ జ్యోతిర్మయి హాజరయ్యారు. ఈసందర్భంగా విద్యాసంస్థల అధినేత చిరంజీవిరెడ్డి మాట్లాడుతూ.. తల్లిదండ్రులు పిల్లలను ఎటువంటి ఒత్తిడి లేని ప్రశాంతమైన వాతవరణంలో ఎదగనివ్వాలన్నారు. పిల్లలకు విద్యతో పాటు వ్యాయామం అవసరమన్నారు. అనంతరం విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు. ఇందులో విజేతలుగా నిలిచిన వారికి ప్రశంసాపత్రాలు, మెడల్స్ ప్రధానం చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

జమకాని ఉపాధి బిల్లులు


ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

● 12 వారాలకు రూ.2.24 కోట్లు పెండింగ్
● ఆందోళన వ్యక్తం చేస్తున్న కూలీలు

రాప్తాడు, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద పనిచేసిన బిల్లులు జమ కాకపోవడంతో పనిచేసే కూలీల ఖాతాల్లోకి ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఒక్కో కూలీకి దాదాపు పన్నెండు వారాలకు పైగా బిల్లులు రావాల్సి ఉందని చెబుతున్నారు. బిల్లులు సకాలంలో జమకాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని కూలీలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నెలలు గడిచినా కూలీ డబ్బు జమ కాకపోతే ఎలా జీవించాలి అని వాపోతున్నారు. వేసవిలో వలసలు నివారించి కూలీలకు స్థానికంగానే పని కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకాన్ని ప్రవేశపెట్టింది. ఆ పథకం నిబంధనల ప్రకారం పని పూర్తయిన తరువాత 15 రోజులకు కూలీల ఖాతాల్లో బిల్లులు జమ కావాలి. నిర్ణీత కొలత ప్రకారం కూలీలు పని చేస్తే రోజుకు రూ. 307 కూలీ లభిస్తుంది. ఈ ఏడాది జనవరి నుంచి కూలీలు ఎక్కువగా పనులకు వెళుతున్నారు. జనవరి మొదటి వారం నుంచి నుంచి ఏప్రిల్ మొదటి వారం వరకు 12 వారాల బిల్లులు కూలీలకు జమ కావాల్సి ఉంది.నెలలు గడుస్తున్నా కూలి డబ్బు ఖాతాల్లో జమ కాలేదని కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలో తొమ్మిది వేలకు పైగా జాబ్‌కార్డులు యాక్టివ్‌లో ఉన్నాయి. దాదాపు ఎనిమిది వేల మంది కూలీలు ఉపాధి పనులకు వెళతారు. ప్రస్తుతం మూడు వేల మంది ఉపాధి పనులను వెళుతున్నారు. కూలీలు చేసిన పనులకు 12 వారాలకు గానూ రూ. 2.24 కోట్లు జమ కావాల్సి ఉండగా... సకా లంలో వారి ఖాతాల్లో కూలి డబ్బు జమ కాలేదని కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వెంటనే జమ చేయాలి



జనవరి నుంచి ప్రతి రోజూ ఉపాధి పనులకు వెళుతున్నాం. దాదాపు 12 వారాల బిల్లులు ఖాతాలో జమ కావాల్సి ఉంది. కూలి డబ్బు ఖాతాలో జమ అవుతుందని ఎంతో ఆశగా ఎదురు చూస్తున్నాం. అధికారులు స్పందించి ఖాతాల్లో కూలి డబ్బు జమ చేయాలి

● వెంకటరమణారెడ్డి, కూలీ, రాప్తాడు

ఇబ్బంది పడుతున్నాం



వేసవిలో వ్యవసాయ పనులు లేకపోవడంతో ఉపాధి పనులకు వెళుతున్నాం. ఉపాధి కూలీలకు చేసిన పనులకు డబ్బు సకాలంలో జమ చేయ లేదు. కుటుంబ పోషణ, నిత్యావసర వస్తువుల కొనుగోలు కోసం ఎంతో ఇబ్బంది పడుతున్నాం.

-రోషన్న, కూలీ, రాప్తాడు

కూలి పనులే జీవనాధారం



జనవరి నుంచి ఉపాధి పనులకు వెళుతున్నాం. అప్పటి నుంచి ఈ నెల మొదటి వారం వరకూ చేసిన కూలి పనులకు బిల్లులు జమ కావాల్సి ఉంది. కూలి పనులు చేసుకుని జీవనం సాగించే మాకు బిల్లులు చెల్లించకపోతే ఎలా? వెంటనే ఖాతాల్లో జమ చేయాలి.

- నాగేంద్ర, కూలీ, రాప్తాడు

త్వరలోనే జమవుతాయి

కూలీలకు బిల్లులు ఖాతాల్లో జమ కావాల్సి ఉంది. చేసిన పనులకు బిల్లులు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేశాం. ప్రభుత్వం నిధులు విడుదల చేసిన వెంటనే కూలీల ఖాతాల్లో డబ్బు జమ అవుతుంది.

- సావిత్రి, ఏపీఓ, రాప్తాడు

ఒక్క ఉపాధ్యాయ పోస్టూ భర్తీ చేయని వైసీపీ

● ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్

అనంతపురం అర్బన్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): గత ఐదేళ్ల పాలనలో ఒక్క ఉపాధ్యాయ పోస్టు భర్తీ చేయని హీన చరిత్ర వైసీపీది అని ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో మండిపడ్డారు. ఎన్నికలకు మునుపు ఇచ్చిన హామీని సీఎం చంద్రబాబునాయుడు, మంత్రి నారా లోకేశ్ నిలబెట్టుకున్నారన్నారు. సీఎం చంద్రబాబు జన్మదినం రోజున మంత్రి నారా లోకేశ్ 16,347 ఉపాధ్యాయ పోస్టుల భర్తీ కోసం డీఎస్సీ నోటిఫి కేషన్ విడుదల చేసి నిరుద్యోగులకు బహుమతి ఇచ్చారన్నారు. గత వైసీపీ సర్కార్‌లో డీఎస్సీ నోటిఫికేషన్ కోసం నిరుద్యోగులు నిరసనలు చేపడితే వారిపై కేసులు పెట్టించే ప్రయత్నం చేశారన్నారు. నిరుద్యోగుల కలలు సాకా రం చేసేలా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేస్తే, వైసీపీ నాయకులు విమర్శ లు చేయడం సిగ్గుచేటన్నారు. యువగళం పాదయాత్రలో నిరుద్యోగుల సమ స్యలను నారా లోకేశ్ కళ్లారా చూశారని, ఖచ్చితమైన ప్రణాళికలతో నిరుద్యోగులకు న్యాయం చేసేందుకు ముందుకు వెళుతున్నారన్నారు. భవిష్యత్తులో 25 లక్షల ఉద్యోగాల కల్పనే ధ్యేయంగా ఆయన పనిచేస్తున్నారన్నారు.

గ్రీనరీ పనులను నాణ్యంగా చేపట్టండి : మేయర్

అనంతపురం క్రైం, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): నగరంలోని రాంనగర్‌లోని అంబేడ్కర్ ఫ్లైఓవర్ కింద చేపట్టే గ్రీనరీ పనులను నాణ్యతతో చేపట్టాలని నగర మేయర్ మహమ్మద్ వసీం అధికారులను ఆదేశించారు. మంగళవారం మేయర్ నగరంలోని 37వ డివిజన్‌లో కమిషనర్ బాలస్వామితో కలిసి పర్యటించారు. పారిశుధ్య పనులు, రోడ్లు, డ్రైనేజీలు పరిశీలించారు. అంబేడ్కర్ ఫ్లైఓవర్ కింద ఎన్‌క్యాప్ నిధులు రూ. 34లక్షలతో గ్రీనరీ పనుల డిజైన్ మ్యాప్‌ను పరిశీలించారు. త్వరితగతిన నాణ్యతతో పనులు పూర్తి చేయించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఈఈలు షాకీర్, నరసింహులు, డీఈ సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

జేఎన్టీయూతో సుదీర్ఘ అనుబంధం

● వీసీ సుదర్శనరావు సేవలపై ఫ్యాకల్టీ హర్షం


వీసీ ప్రొఫెసర్ సుదర్శనరావును సన్మానిస్తున్న టీచింగ్ ఫాకల్టీ

అనంతపురం సెంట్రల్, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): విద్యార్థిగా, టీచింగ్ ఫ్యాకల్టీగా వీసీ ప్రొఫెసర్ సుదర్శన రావుకు జేఎన్టీయూతో సుదీర్ఘ అనుబంధాన్ని కలిగిన ఏకైక వ్యక్తి అని పలువురు సీనియర్ ప్రొఫెసర్లు పేర్కొన్నారు. మంగళవారం జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాల టీచింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వీసీ సుదర్శనరావుకు సన్మాన సభను నిర్వహించారు. అసోసియేషన్ అధ్యక్షులు ప్రొఫెసర్ నారాయణరెడ్డి అధ్యక్షతన ఎన్టీఆర్ ఆడిటోరియంలో ఏర్పాటుచేసిన సభకు వీసీతోపాటు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ క్రిష్ణయ్య, వీసీటూ ఓఎస్డీ ప్రొఫెసర్ దేవన్న, ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ చెన్నారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా వీసీ సుదర్శనరావు ఉద్యోగ ప్రస్థానం, మైలురాళ్ల అంశాలపై టీచింగ్ ఫ్యాకల్టీ వారి అనుభవాలను పంచుకున్నారు. అనంతరం వీసీ మాట్లాడుతూ విద్యార్థిగా, ఉద్యోగిగా జేఎన్టీయూ ఒక వేదికను కల్పించిందన్నారు. తన ప్రతిభను, అనుభవాన్ని గుర్తించి సీఎం నారాచంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్ తనకు జేఎన్టీయూ వీసీగా బాధ్యతలు అప్పగించారన్నారు. వర్సిటీ అభివృద్ధికి ప్రభుత్వ సహకారంతో కృషిచేస్తానని తెలిపారు. అనంతరం ఆయన్ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో అసోసియేషన్ ఉపాధ్యక్షులు జయలక్ష్మి, సెక్రెటరీ శారద, జాయింట్ సెక్రెటరీ శివకుమార్, టీచింగ్ ఫ్యాకల్టీ పాల్గొన్నారు.

ఈకేవైసీ వంద శాతం పూర్తిచేయాలి

కనగానపల్లి, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): రేషన్‌కార్డులో ఉన్న ప్రతి ఒక్కరి ఈకేవైసీ చేయించాలని తహసీల్దార్ ప్రసాద్, సీఎస్‌డీటీ కవిత రేషన్ డీలర్లను ఆదేశించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం వారు రేషన్ డీలర్లతో సమావేశమయ్యారు. మండల వ్యాప్తంగా 13 వేల కార్డులకు గాను 36,708 మంది లబ్ధిదారులున్నారన్నారు. ఇందులో 3,340 మంది ఈకేవైసీ చేయించలేదన్నారు.

అనధికార లే అవుట్లపై చర్యలు

అనంతపురం క్రైం, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): అహుడా పరిధిలో వేసిన అనధికార లేఅవుట్లపై అధికారులు చర్యలు తీసుకున్నారు. అహుడా ఛైర్మన్ టీసీ వరుణ్, వైస్ ఛైర్మన్ శివ్ నారాయణ శర్మ ఆదేశించిన నేపథ్యంలో అధికారులు వరుసగా చర్యలు చేపడుతున్నారు. మంగళవారం అహుడా ప్లానింగ్ ఆఫీసర్ ఇషాక్ ఆధ్వర్యంలో సర్వేరాళ్లను తొలగించారు. అహుడా పరిధిలోని రేకులకుంటలో సర్వేనంబరు 260, దయ్యాలకుంటపల్లి సర్వే నంబరు 117, చెన్నంపల్లిలో 435/1, నార్పల సర్వేనంబరు 11, 24, 4, 5, 6, 22, 23లలో వేసిన అక్రమ లేఅవుట్లలో రాళ్లను తొలగించారు. అనుమతులు తీసుకోవాలని లేకపోతే చర్యలు తప్పవని అధికారులు హెచ్చరించారు. కార్యక్రమంలో జేపీఓ హరీష్‌చౌదరి, ప్లానింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

ఐఏఎస్, ఐపీఎస్ కోర్సులపై అవగాహన

అనంతపురం విద్య, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని పలు ప్రైవేట్ స్కూళ్ల కరస్పాండెంట్లకు ఐఏఎస్, ఐపీఎస్ కోర్సులపై అవగాహన కల్పించారు. మంగళవారం సంగమేష్‌నగర్‌లోని రఘు సైనిక్ స్కూల్‌లో 21ఫస్ట్ సెంచ్యూరీ అకాడమీ, జిల్లా ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కరస్పాండెంట్లకు ఉచిత అవగాహన కల్పించారు. జిల్లా ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ నాయకులు గంగాధర్, గోపాల్‌రెడ్డి, రమణారెడ్డి, రవిచంద్రారెడ్డి, రాఘవేంద్ర, చంద్రశేఖర్‌రెడ్డి, శేషాద్రి, బాబయ్య, భాష, నరేంద్ర, అనిల్‌కుమార్, వేణుగోపాల్, లక్ష్మీనారాయణ, లక్ష్మి, వనజ, వెంకటేష్, శ్రీవాత్సవకుమా ర్, విజయ్‌కుమార్, జానకిరాములు పాల్గొన్నారు.

రెండోరోజూ అభివృద్ధి పనుల పరిశీలన

అనంతపురం న్యూటౌన్, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎంపీ నిధులతో గత ఐదేళ్లలో చేపట్టిన అభివృద్ధి పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించేందుకు వచ్చిన ప్రత్యేక బృందం మంగళవారం రెండో రోజూ పలు ప్రాంతాల్లో పర్యటించింది. ఆత్మకూరు మండల కేంద్రంలో రూ.25 లక్షలతో నిర్మించిన కమ్యూనిటీ హాల్‌ను, కళ్యాణదుర్గం మండలం యాటకల్లు గ్రామంలో రామలింగేశ్వర స్వామి గుడి వద్ద నిర్మిస్తున్న కమ్యూనిటీ హాల్‌ను, బెళుగుప్పలో నిర్మిస్తున్న వెటర్నరీ భవనాన్ని పరిశీలించారు. సేవాగఢ్‌లోని కల్చరల్ హాల్ కోసం నిర్మాణం చేపట్టిన అదనపు గదులను తదితరాలను పరిశీలించారు. ఈ తనిఖీల్లో కమిటీ సభ్యులు హేమంత్‌కుమార్, రాజేష్‌తో పాటు స్థానిక అధికారులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి

గార్లదిన్నె, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల మునుపు భవన నిర్మాణ కార్మికులకు ఇచ్చిన హామీని తక్షణమే అమలు చేయాలని సీఐటీయూ నాయకులు నాగరాజు, చెన్నారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరిద్ధంచాలని డిమాండ్ చేస్తూ ఈనెల 25న సీఐటీయూ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తామన్నారు. మంగళవారం గార్లదిన్నెలో సంబంధిత కరపత్రాలు విడుదల చేశారు.

ఉపాధి కూలీలకు భృతి ఇవ్వాలి

● వ్యకాసం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు జెల్లీ విల్సన్


సమావేశంలో మాట్లాడుతున్న తులసిరెడ్డి

అనంతపురం విద్య, ఏప్రిల్22 (ఆంధ్రజ్యోతి): ఉపాధి కూలీలకు ఏడాదికి రూ. 12వేల భృతి ఇవ్వాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు జెల్లీ విల్సన్ డిమాండ్ చేశారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సీహెచ్ వెంకటేశ్వరరావు అధ్యక్షతన కష్టజీవుల పాదయాత్ర ముగింపు సభను కృష్ణ కళామందిరంలో మంగళవారం నిర్వహించారు. ఈ సభలో విల్సన్ మాట్లాడుతూ ఉపాధి పథకం రక్షణ కోసం ఉద్యమిస్తామని అన్నారు. ఈ పథకాన్ని కష్ట జీవుల కోసం 2006లో అప్పటి ప్రధాని మన్మోహన్‌సింగ్, యూపీఏ చైర్‌పర్సన్ సోనియాగాంధీ, అప్పటి సీఎం వైఎస్సార్ ప్రారంభించారని గుర్తు చేశారు. కాంగ్రెస్ హయాంలో ఐదేళ్ల పాటు ఉపాధి చట్టం విజయవంతంగా అమలు చేశారని గుర్తు చేశారు. మోదీ ప్రభుత్వం రాగానే అంచెలంచెలుగా ఈ చట్టాన్ని నిర్వీర్యం చేస్తున్నారని ఆరోపించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఏఐసీసీ నాయకుడు తులసి రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం తర్వాత వచ్చిన అన్ని ప్రభుత్వాలు ఉపాధి చట్టాన్ని నిర్వీర్యం చేస్తున్నాయని మండిపడ్డారు. ఈ చట్టాన్ని రక్షించుకోవడానికి ఉద్యమించాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో వ్యకాసం రాష్ట్ర కార్యదర్శి ఆవుల శేఖర్, సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్, సత్యసాయి జిల్లా కార్యదర్శి వేమయ్య, జిల్లా సహాయ కార్యదర్శి నారాయణస్వామి, మల్లికార్జున, వ్యకాసం రాష్ట్ర కార్యదర్శి కేశవరెడ్డి సీపీఎం జిల్లా కార్యదర్శి నల్లప్ప, కాంగ్రెస్ పార్టీ నాయకుడు దాదాగాంధీ తదితరులు పాల్గొన్నారు.

ఎనిమిది రకాల స్కూళ్లు వద్దు: ఏపీటీఎఫ్


డీఈఓకు వినతి పత్రం ఇస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

అనంతపురం విద్య, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): పాఠశాలల పునర్వ్యవస్థీకరణ పేరుతో ఎనిమిది రకాల స్కూళ్లు తేవాలనుకోవడం సరి కాదని...ఈ నిర్ణయాన్ని విరమించుకోవాలని ఏపీటీఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. ఆ సంఘం నాయకులు మంగళవారం డీఈఓ ప్రసాద్‌బాబును కమలానగర్‌లోని పాత డీఈఓ కార్యాలయంలో కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ప్రభుత్వం 117 జీవో తీసుకొచ్చి ప్రయోగాలు చేసి విద్యారంగాన్ని విచ్ఛిన్నం చేసిందన్నారు. ఈ ప్రభుత్వం 117కు ప్రత్యామ్నాయం అంటూ విద్యారంగాన్ని మరింత బలహీనపరుస్తోందన్నారు. రాష్ట్రంలో ఎనిమిది రకాల స్కూళ్ల తేవడం మంచిదికాదన్నారు. ప్రతి గ్రామంలో ఒకటో తరగతి నుంచి ఐదో తరగతి వరకు ప్రాథమిక పాఠశాల మాత్రమే ఆమోదయోగ్య మన్నారు. హైస్కూళ్లలో ఆరో తరగతి నుంచి పదో తరగతి వరకు, హై స్కూల్+2 స్కూళ్లను కొనసాగించాలని కోరారు. సీనియారిటీ లిస్టులో ని లోపాలు సరిచేయాలన్నారు. మోడల్ ప్రైమరీ స్కూళ్లకు ప్రధానోపాధ్యాయులుగా ఎల్‌ఎఫ్‌ఎల్ హెచ్‌ఎంలను నియమించా లని డిమాండ్ చేశారు. వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని డీఈఓకు అందించారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్‌జిల్లా అధ్యక్షులు వెంకటేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి సిరాజుద్దీన్, పూర్వపు రాష్ట్ర కార్యదర్శి నరసింహులు, ఇతర నేతలు సతీష్ కుమార్, సర్దార్‌వలి, వెంకటరమణ, వన్నప్ప, శ్రీనివాసులు, ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ చిత్రపటానికి క్షీరాభిషేకం

శింగనమల, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): ఎమార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ నాయకత్వంలో చేసిన పోరాటాల ఫలితంగానే ఎస్సీ వర్గీకరణ సాధ్యమైందని ఎంఈఎఫ్ జాతీయ అదనపు ప్రధాన కార్యదర్శి బండారు శంకర్ పెర్కోన్నారు.. వర్గీకరణ అమలు చేయడంతో మంగళవారం శింగనమలలోని అంబేడ్కర్ విగ్రహానికి పూల మాల వేసి నివాలర్పించారు. అంబేడ్కర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు.

సెలవులో పీఆర్ ఎస్ఈ పీఏ

అనంతపురం న్యూటౌన్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): పంచాయతీరాజ్ ఎస్ఈ పీఏ, డీఈ రాజేంద్రప్రసాద్ వ్యక్తిగత పనులపై మంగళవారం నుంచి నెల రోజుల సెలవులో వెళ్లారు. ఆయన తిరిగి బాధ్యతలు చేపట్టే వరకు డీఈ చంద్రకుమార్‌కు అదనపు బాధ్యతలు అప్పగించారు. ఆయన తిరిగి మే 21 విధులకు హాజరు కానున్నారు.

సామాన్యులకు న్యాయం అందాలి

● రాజ్యసభ మాజీ సభ్యుడు తులసిరెడ్డి


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న తులసిరెడ్డి

అనంతపురం న్యూటౌన్, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): ప్రజా ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని సామాన్య ప్రజలకు తగిన న్యాయం జరిగేలా పాలన ఉండాలని కాంగ్రెస్ నాయకులు, రాజ్యసభ మాజీ సభ్యులు తులసిరెడ్డి పేర్కొన్నారు. వైసీపీ, టీడీపీ కూటమి పార్టీలు రెండూ రాష్ట్రానికి దాపురించిన రాహుకేతువులని మండి పడ్డారు. మంగళవారం జిల్లా కేంద్రానికి వచ్చిన ఆయన కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మైనార్టీ విభాగం అధ్యక్షుడు దాదాగాంధీతో కలిసి ఆ పార్టీ జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తులసిరెడ్డి మాట్లాడుతూ.. జగన్ ఐదేళ్లపాటు అరచేతిలో వైకుంఠం చూపిస్తే.. చంద్రబాబు కైలాసం చూపిస్తున్నారని పేర్కొన్నారు. ప్రస్తుతం రాష్ట్ర పరిస్థితి పెనం మీద నుంచి పొయ్యిలో పడినట్లుగా ఉందన్నారు. వైసీపీ గత ఐదేళ్లు రాష్ట్రాన్ని అప్పులు, అరాచకాలు, ఆటవిక చర్యలు, మద్యం, జూదం, డ్రగ్స్, గంజాయి ఆంధ్రప్రదేశ్‌గా చేసి వెళ్లిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. అంతకంటే దారుణంగా ప్రస్తుత ప్రభుత్వం తీరు కనిపిస్తోందన్నారు. సర్దుబాటు చార్జీల పేరుతో రూ.15,485 కోట్లు అదనపు భారం ప్రజలపై మోపింద న్నారు. నిరుద్యోగ భృతి, తల్లికి వందనం, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఆడబిడ్డ నిధి అడ్రస్ లేవ న్నారు. వైద్య విద్యను అమ్మకానికి పెట్టి ప్రతిభా వంతులైన నిరుపేద విద్యార్థులకు అవకాశం లేకుండా చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శంకర్, ఓబీసీ జిల్లా ఛైర్మన్ రామ్‌చరణ్ యాదవ్, సేవాదళ్ నాయకులు హరిరాయల్, నాయకులు కొండారెడ్డి, ప్రసాద్ రెడ్డి, రామాంజినేయులు ఎన్ఎస్‌యూఐ నాయకులు ఓబిలేసు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో కార్యక్రమాలపై సమాచారం ఇవ్వండి

రామగిరి, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని గ్రామాలలో ఏవైనా గ్రామ దేవతల పూజలు, గ్రామోత్సవాలు, చెక్క భజనలు, ఇతర సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తే ముందుగా పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఎస్ఐ సుధాకర్‌యాదవ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పోలీసు అధికారులకు ముందస్తు సమాచారం లేకుండా జరిగే కార్యక్రమాల వల్ల ఏవైనా అవాంఛనీయ సంఘటనలు జరిగితే కార్యక్రమాల నిర్వాహకులు, గ్రామ పెద్దలు బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. గ్రామాలలో సక్రమంగా కార్యక్రమాలు నిర్వహించేందుకు గ్రామపెద్దలు, గ్రామస్థుల సహకారం అవసరమన్నారు.

న్యాయమైన సమస్యలు పరిష్కరించాలి

● సీహెచ్‌ఓల డిమాండ్ ● కలెక్టరేట్ వద్ద ధర్నా


కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న కమ్యూనిటీ హెల్త్ అధికారులు

అనంతపురం టౌన్, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): ఉద్యోగ భద్రత కల్పించాలని, వేతన సవరణ చేయాలని, ఇతర న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ కమ్యూనిటీ హెల్త్ అధికారులు ఆందోలన చేపట్టారు. నిరసనలో భాగంగా మంగళవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా కొనసాగించారు. ఈ సందర్భంగా ఆ సంఘం నాయకులు గణేష్, ప్రియాంక, సదీర్‌గౌరీ తదితరులు మాట్లాడుతూ 2019నుంచి ఎన్‌హెచ్ఎం ద్వారా ఎంపికైన గ్రామీణ ప్రాంతాల ప్రజలకు వైద్యసేవలు అందిస్తున్నా మన్నారు. ప్రజారోగ్య పరిరక్షణలో కీలకంగా వ్యవహరిస్తున్నామన్నారు. కానీ తమక ఉద్యోగ భద్రత లేదని, వేతనాలు పెంచకపోగా సకాలంలో చెల్లిం చడం లేదన్నారు. కనీస పనికి కనీస వేతనం ఇవ్వకుండా చిన్నచూపు చూస్తున్నారని వాపోయారు. రాష్ట్ర ప్రభుత్వం తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని వేడుకుంటున్నామని పేర్కొన్నారు. ఇలాగే నిర్లక్ష్యం చేస్తే రాష్ట్రం మొత్తం ఆందోలనలు చేపడతామని వారు హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు సువర్ణ, సత్యమయ్య, లక్ష్మీనారాయణ, నాగరాజు, వందలమంది సీహెచ్‌ఓలు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

మెగా డీఎస్సీ సంబరం

రాయదుర్గం, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): ఏళ్లుగా ఎదురు చూస్తున్న డీఎస్సీ నోటిఫికేషన్ రానే వచ్చింది. ఇన్నాళ్లు పుస్తకాలతో కుస్తీపట్టిన ఉద్యోగార్థులు ప్రస్తుతం మరింత సీరియస్‌గా ప్రిపరేషన్ ప్రారంభించారు. నోటిఫికేషన్ రావడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఆన్‌లైన్ దరఖాస్తుల్లో బిజీగా ఉన్నారు.

షెడ్యూల్ ప్రకారమే..



ప్రభుత్వం విడుదల చేసిన డీఎస్సీ నోటిఫికేషన్ షెడ్యూల్ ప్రకారం పూర్తి చేస్తుందని ఆశిస్తున్నా. నోటిఫికేషన్ విడుదల కావడం ఆనందంగా ఉంది. ప్రభుత్వ ఉపాధ్యాయులు కావాలనే నిరుద్యోగుల ఆకాంక్షను ప్రభుత్వం నెరవేర్చబోతోంది. షెడ్యూల్‌లో కనబరిచిన విధంగా ఎలాంటి వాయిదాలు వేయకుండా ప్రక్రియను పూర్తి చేస్తుందనే నమ్మకం ఉంది.

- ఎస్ మనోహర్, రాయదుర్గం

సరైన సమయంలోనే...



డీఎస్సీ నోటిఫికేషన్‌ను సరైన సమయంలో వదిలారు. నోటిఫికేషన్‌ను వదిలాక 45 రోజుల పాటు చదువుకోవడానికి, దరఖాస్తు ప్రక్రియను పూర్తి చేసుకోవడానికి అవకాశం ఇచ్చారు. 60 రోజుల వ్యవధి ఇచ్చి ఉంటే బాగుండేది. అయినప్పటికీ నోటిఫికేషన్ రావడం చాలా శుభపరిణామం.

- పి. నవీన్, రాయదుర్గం

చాలా ఆనందం



గతంలో ఆరువేల పోస్టులతోనే నోటిఫికేషన్ విడుదల చేస్తారని అనుకున్నాం. ముఖ్యమంత్రి చంద్రబాబు 16వేల పోస్టులతో మెగా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయడం చాలా ఆనందంగా ఉంది. ఖచ్చితంగా ఉద్యోగం సాధిస్తా.

-ఎస్ యశోద, వీరాపురం, గుమ్మఘట్ట మండలం

ప్రక్రియ సజావుగా సాగాలి



మెగా డీఎస్సీ నోటిఫికేషన్ ప్రక్రియను ఎలాంటి అవంతరాలు లేకుండా సజావుగా పూర్తి చేయాలి. వాయిదాలు, ఫలితాల విడుదలలో జాప్యం లేకుండా పోస్టింగ్‌లు ఇచ్చే వరకు సక్రమంగా సాగించాలి. కొత్త టీచర్ల నియామకాలను ఇబ్బందులు లేకుండా పూర్తి చేయాలి.

-కావ్య, రాయదుర్గం

గత ప్రభుత్వం వంచించింది



గత ప్రభుత్వం విలువైన కాలాన్ని వృథాచేసి మా జీవితాలతో అడుకుంది. ఎంతోకాలంగా నోటిఫికేషన్ కోసం ఎదురుచూశాం. కానీ ఆశలు నిరాశలయ్యాయి. ఏళ్లుగా నిరీక్షించిన కల ఇప్పుడు నెరవేరబోతోంది. డీఎస్సీ నోటిఫికేషన్‌తో నిరుద్యోగులకు మంచిరోజులు వచ్చాయి.

-సంయుక్త, శ్రీధరఘట్ట, బొమ్మనహాళ్ మండలం

ఏడేళ్ల కల



తల్లిదండ్రులు ఎంతో కష్టపడి చదివించారు. అప్పటి నుంచి ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా ఉద్యోగం సంపాదించాలని ఎదురు చూస్తున్నా. గత ఏడేళ్లుగా డీఎస్సీ నోటిఫికేషన్ కోసం ఎదురు చూస్తూ ఉన్నాము. ఆ కల ఇప్పుడు నెరవేరినందుకు సంతోషిస్తున్నాం.

-వీరేష్, డీ.హీరేహాళ్

పోలీస్‌స్టేషన్ వద్ద ఫిర్యాదుల పెట్టె



యాడికి పీఎస్ వద్ద ఫిర్యాదుల బాక్స్

యాడికి, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): స్థానిక పోలీస్‌స్టేషన్ వద్ద ఫిర్యాదుల పెట్టె ఏర్పాటు చేశారు. పోలీస్‌స్టేషన్ చుట్టూ తిరిగినా పరిష్కారం కాని ఫిర్యాదుల పరిష్కారానికి మీ మాటే ముఖ్యం పేరుతో ఏఎస్పీ రోహిత్ కుమార్‌చౌదరి కొత్త కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా మార్చి 21న యాడికి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదులు స్వీకరించారు. ఆ సందర్భంగా పోలీస్‌స్టేషన్ వద్ద ఫిర్యాదుల పెట్టె ఏర్పాటు చేయాలని పోలీసులను ఆదేశించారు. అందులో భాగంగానే పోలీస్‌స్టేషన్ వద్ద ఫిర్యాదుల పెట్టెను ఏర్పాటు చేశారు.

ప్రభుత్వ బడిలోనే చదవండి: ఎంఈఓ



పి. నారాయణపురంలో అంగన్వాడీ పిల్లలను బడిలో చేర్పిస్తున్న ఎంఈఓ

కూడేరు, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): ప్రతి విద్యార్థిని ప్రభుత్వ పాఠశాల్లో చేర్పించాలని విద్యార్థుల తల్లిదండ్రులకు ఎంఈఓ సాయికృష్ణ పిలుపునిచ్చారు. మంగళవారం కూడేరు మండలం పి.నారాయణపురం గ్రామంలో అంగన్‌వాడీలో చదువుతున్న చిన్నారులను ప్రభుత్వ పాఠశాల్లో చేర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రైవేటు పాఠశాలల కంటే ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్యతోపాటు పుస్తకాలు, దుస్తులు వంటివి ఉచితంగా అందిస్తారన్నారు.

యాడికి: చిన్నారులను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్‌లు విజయకుమారి, శంషాద్‌బేగం తెలిపారు. మండలంలోని యాడికి, రాయలచెరువు సెక్టార్ల పరిధిలోని అంగన్‌వాడీ స్కూళ్లల్లో ప్రీప్రైమరీ విద్యను పూర్తి చేసుకున్న విద్యార్థుల జాబితాను సమీప ప్రభుత్వ ప్రాథ మిక పాఠశాల ప్రధానోపాధ్యాయులకు మంగళవారం అందజేశారు. మండలంలో మొత్తం 112మంది ప్రీ ప్రైమరీ విద్యను పూర్తిచేసుకొని 1వ తరగతిలో చేరనున్నట్లు వారు తెలిపారు.

విద్యార్థులకు ఎన్‌సీసీ సామగ్రి అందజేత



ఎన్‌సీసీ సామగ్రిని అందజేస్తున్న రామ్‌కుమార్, గోపాల్

పామిడి, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని టీసీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మంగళవారం ఎన్‌సీసీ సామగ్రిని ప్రధానోపాధ్యాయుడు రామ్ కుమార్, ఈఓ గోపాల్ అందజేశారు. ఈ సందర్భంగా ఎన్‌సీసీ సూచిక బోర్డును ఏర్పాటు చేశారు. ప్రథమ సంవత్సరం ఎన్‌సీసీ విద్యార్థులకు యూనిఫాం, ట్రాక్ సూట్, టీషర్టు, డీఎంఎస్ షూ, పీటీ షూతో పాటు ఇతర ఎన్‌సీసీ సామగ్రి అందజేశారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ అధికారి రామాంజనేయులు, మాజీ సైనికోద్యోగి లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సీఎం పదవికి మమత రాజీనామా చేయాలి

హిందూ ఐక్యవేదిక నాయకులు



రెవెన్యూ కార్యాలయం ఎదుట నిరసన చేస్తున్న హిందూ ఐక్యవేదిక నాయకులు

గుత్తి ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): పశ్చిమబెంగాల్ రాష్ట్రంలో హిందువులపై దాడులను అరికట్టడంలో విఫలమైన ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి మమతాబెనర్జీ రాజీనామా చేయాలని హిందూ ఐక్యవేదిక నాయకులు డిమాండ్ చేశారు. పశ్చిమబెంగాల్‌లో హిందువులపై దాడులను నిరసిస్తూ పట్టణంలో హిందూ సంస్థల అధ్వర్యంలో మంగళవారం ర్యాలీ నిర్వహించారు. స్థానిక ఆర్ అండ్‌బీ అతిథి గృహం వద్ద నుంచి రాజీవ్ సర్కిల్ గాంధీ సర్కిల్, ఎన్టీఆర్ సర్కిల్ మీదుగా రెవెన్యూ కార్యాలయం వరకూ భారీ ర్యాలీ కొనసాగింది. అనంతరం రెవెన్యూ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టారు. మాజీ ఎమ్మెల్యే మధుసూదన్ గుప్త మాట్లాడుతూ బెంగాల్ రాష్ట్రంలో ముర్షిదాబాద్ మల్దా జిల్లాలో హిందువులపై భౌతిక దాడులు జరుగుతున్నాయన్నారు. ఆ రాష్ట్రంలో హిందువుల పరిస్థితి దారుణంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్రం వెంటనే అక్కడ రాష్ట్రపతి పాలన విధించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో హిందు ఐక్యవేదిక నాయకులు తిమ్మారెడ్డి, రమణా, క్రిష్ణయ్య, ఓబులయ్య, రామకృష్ణ, వెంకప్ప పాల్గొన్నారు.

బాల్య వివాహాలతో భవిష్యత్తు అంధకారం



ర్యాలీ నిర్వహిస్తున్న ఆశ, అంగన్‌వాడీ కార్యకర్తలు

రాయదుర్గం/పుట్లూరు/పామిడి, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): బాల్యవివాహాలు చేయడం వల్ల చదువులు కుంటుపడతాయని, భవిష్యత్తు అంధకారమవుతుందని వైద్యాధికారి రాజేంద్రప్రసాద్ పేర్కొన్నారు. మండలంలోని టీ వీరాపురం గ్రామంలో బాల్య వివాహాల నిర్మూలన చట్టం, భేటీ బచావో భేటీ పడావో, లింగ నిర్ధారణ నిరోధక చట్టంపై మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. పీహెచ్‌సీ వైద్యులు రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ బాల్యవివాహాలు నివారించకపోతే నిర్వీర్యమైన సమాజం ఉత్పన్నం అవుతుందన్నారు. చట్టాలు గుర్తించి మసులుకోవాలన్నారు.

ఈ కార్యక్రమంలో ఆరోగ్య విద్యాబోధకుడు కెంచె లక్ష్మీనారాయణ, ఆరోగ్య పర్యవేక్షకులు రామాంజినేయులు, ఆరోగ్య సహాయకులు మాంతేశ్వరి, పార్వతి, ఆదిలక్ష్మి, సచివాలయ సెక్రెటరీ ప్రవీణ్, వెల్ఫేర్ అసిస్టెంట్ శాంతి, ఆశ, అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అవగాహన సదస్సు

పుట్లూరులోని స్థానిక కేజీబీవీ, ఆదర్శ పాఠశాలల్లో విద్యార్థులకు బాల్యవివాహాలు, టీనేజీ ప్రెగ్నెన్సీలపై మంగళవారం అవగాహన కల్పించారు. వైద్యాధికారి శ్రీవాణి మాట్లాడుతూ బాల్యవివాహాలు ఎవరైనా చేసుకుంటే పోలీసులకు ఫిర్యాదు చేయాలన్నారు. వాటి వల్ల జరిగే అనర్థాలను వివరించారు. ప్రిన్సిపాల్ ఓబుళరెడ్డి పాల్గొన్నారు.

విద్యతోనే అభివృద్ధి

విద్యతోనే అభివృద్ధి సాధ్యమని హెల్త్ ఎడ్యుకేటర్ వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. పామిడి మోడల్ స్కూల్‌లో మంగళవారం ఎద్దులపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సుధాకర్ ఆధ్వర్యంలో విద్యార్థినులకు బాల్య వివాహాలు, విద్య ఆవశ్యకతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా గుడ్ టచ్, బ్యాడ్ టచ్ పై అవగాహన కల్పించారు. వ్యక్తిగత పరిశుభ్రత గురించి వివరించారు. ప్రిన్సిపాల్ అరుణ, హెల్త్ సూపర్‌వైజర్ శ్రీరామ్ రెడ్డి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

బొమ్మనహాళ్, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని క్రిష్టాపురం గ్రామానికి చెందిన ఎర్రిస్వామి(19) బళ్లారి విమ్స్‌లో చికిత్స పొందుతూ మంగళవారం మధ్యాహ్నం మృతి చెందినట్లు ఎస్ఐ నబీరసూల్ తెలిపారు. క్రిష్టాపురం గ్రామానికి చెందిన మృతుడు ఎర్రిస్వామితో పాటు లేపాక్షి, లాలూస్వామిలు ముగ్గురు సోమవారం మధ్యాహ్నం ద్విచక్రవాహనంలో ఉప్పరహాల్ క్రాస్ నుంచి స్వగ్రామానికి వెళ్తూ ఎదురుగా వస్తున్న ఆటోను ఢీ కొట్టారు. దీంతో ద్విచక్ర వాహనం నడుపుతున్న ఎర్రిస్వామికి బలంగా గాయాలు కాగా లాలూస్వామి, లేపాక్షి స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ఆటో డ్రైవర్‌కు జిలాన్ కూడా గాయాలతో బళ్లారి విమ్స్‌లో చికిత్స పొందుతున్నట్లు తెలిపారు. ఎర్రిస్వామికి తీవ్రగాయాలు కావడంతో బళ్లారి విమ్స్‌కు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తెలిపారు. బంధువులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు.

తప్పు చేస్తే చర్యలు తప్పవు: డ్వామా పీడీ



సమావేశంలో మాట్లాడుతున్న పీడీ సలీం బాషా

కంబదూరు, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో తప్పు చేస్తే శాఖపరమైన చర్యలు తప్పవని డ్వామా పీడీ సలీం బాషా హెచ్చరించారు. మంగళవారం మండల పరిషత్తు కార్యాలయ భవనంలో ఉపాధి పనులు, పీ-4 సర్వే, పింఛన్ల పంపిణీపై వివిధ శాఖలకు చెందిన అధికారులతో ప్రత్యేక సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో పూర్తిస్థాయిలో సర్వే చేపట్టాలన్నారు. సమావేశంలో డివిజనల్ అభివృద్ధి అధికారి నాగేశ్వరరావు, ఇన్‌చార్జ్ ఎంపీడీవో గూడెన్న, ఏవో తిప్పయ్య, ఆయాశాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో విజిలెన్స్ తనిఖీలు

విడపనకల్లు, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): వజ్రకరూరు మండలంలోని వెంకటాంపల్లి తండా, వీపీపీ తండా, పందికుంట చెరువు గ్రామాల్లో విజిలెన్స్ అధికారుల బృందం మంగళవారం పర్యటించారు. వీపీపీ తండా ఆరోగ్య ఉపకేంద్రం రీ మోడలింగ్ చేసిన విషయమై ఈ నెల 6న అంతా కలరింగే శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితమైంది. దీనిపై గ్రామస్థులు విజిలెన్స్ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో వారు మూడు గ్రామాల్లో పర్యటించి ఎంపీపీ నిధులతో చేసిన పనులను పరిశీలించారు. అయితే విజిలెన్స్ అధికారులు రాలేదని, క్వాలిటీ కంట్రోల్ అధికారులు వచ్చి విచారణ చేపట్టినట్లు మండల ఏఈ మణిభూషన్ పేర్కొన్నారు.

పోక్సో కేసు నమోదు

పుట్లూరు, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఓ గ్రామంలో మూడేళ్ల బాలికపై 55ఏళ్ల ప్రసాద్ అత్యాచారయత్నం చేయబోయినట్లు సమాచారం. బాలిక ఆడుకుంటుండగా గమనించిన ప్రసాద్ అత్యాచారం చేయబోయాడు. బాలిక కేకలు వేయగా తల్లిదండ్రులు రావడంతో అతడు పారిపోయినట్లు తెలిసింది. వృద్ధుడిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

నేడు మండల సమావేశం

యాడికి, ఏప్రిల్22(ఆంధ్రజ్యోతి): మండల సాధారణ సర్వసభ్య సమావేశాన్ని బుధవారం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ వీరరాజు తెలిపారు. ఎంపీపీ ఉమాదేవి అధ్యక్షతన యాడికిలోని సమావేశ భవనంలో సాధారణ సర్వసభ్య సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఉదయం 11గంటలకు నిర్వహించే సమావేశానికి గౌరవ సభ్యులు, అన్నిశాఖల అధికారులు హాజరుకావాలని తెలిపారు.

నీటి సరఫరాకు అంతరాయం

ఉరవకొండ, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): ఉరవకొండ తాగునీటి ప్రాజెక్టుకు సంబంధించిన పైపులైన్లు పగిలిపోయాయి. దీంతో నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడింది. మండలంలోని రాకెట్ల సమీపంలో, పట్టణ శివారులోని కణేకల్లు రోడ్డులో పైపులైన్లు పగిలిపోయాయి. వీటికి మరమ్మతులు చేపట్టి, నీటి సరఫరాకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటామని డీఈ సర్ఫీన్ తెలిపారు.

కార్యదర్శిపై విచారణ

రాయదుర్గం, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): పంచాయతీ కార్యదర్శి అశ్వత్‌రెడ్డిపై ఈఓపీఆర్డీ మంగళవారం విచారణ చేపట్టారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యంపై ఫిర్యాదులు రావడంతో మంగళవారం నాగిరెడ్డిపల్లి సచివాలయానికి చేరుకొని గ్రామస్థుల సమక్షంలో విచారణ చేపట్టారు. సచివాలయానికి ప్రతిరోజు సమయానికి రాకుండా ఎప్పుడు పడితే అప్పుడు వస్తున్నాడని పంచాయతీల నిధులు వాడకంలో సమాచారం అడిగితే నిర్లక్ష్య సమాధానం ఇస్తున్నట్లు పంచాయతీలో పారిశుద్ధ్య కార్మికులకు వేతనాలు ఇవ్వడంలో అలసత్వం ప్రదర్శిస్తున్నాడని గ్రామస్థులు ఆరోపించారు. ఈ విషయంపై సమగ్ర విచారణ జరిపి నివేదికను పైస్థాయి అధికారులకు అందిస్తానని ఈఓపీఆర్డీ మురళీకృష్ణ తెలిపారు. ఈ కార్యక్రమంలో హనుమంతు, సోమశేఖర్, వన్నూరుస్వామి, శీనప్ప, దేవేంద్రప్ప తదితరులు పాల్గొన్నారు.

ఐఓసీ ఆధ్వర్యంలో కుట్టు శిక్షణ



శిక్షణా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న నక్కనదొడ్డి సర్పంచు వరలక్ష్మి


గుంతకల్లు, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎన్ కొట్టాల గ్రామంలో మంగళవారం ఉదయం ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐఓసీ) ఆధ్వర్యంలో మహిళలకు ఉచిత కుట్టు శిక్షణా కేంద్రాన్ని ప్రారంభించారు. నక్కనదొడ్డి సర్పంచు వరలక్ష్మి లాంఛనంగా రిబ్బన్ కత్తిరించి టైలరింగ్ ట్రైనింగ్ సెంటరును తెరిచారు. ఈ సందర్భంగా ఐఓసీ సీనియర్ డిపో మేనేరు హరీశ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సీఎస్ఆర్) నిధులు రూ.44 లక్షలతో పంచాయతీలోని గ్రామాలలో కుట్టు శిక్షణా కేంద్రాలను ప్రారంభిస్తున్నట్టు తెలియజేశారు. శిక్షణానంతరం మహిళలకు కుట్టు మిషన్లను ఉచితంగా అందజేస్తామని తెలియజేశారు. కార్యక్రమంలో ఐఓసీ మేనేజరు రాజేంద్ర ప్రసాద్, డైరెక్టర్ గోవింద రాజులు, లైజనర్ జీఏ నజీర్, ఐఓసీ ఉద్యోగ సంఘ కార్యదర్శి ఖలీల్ బాషా పాల్గొన్నారు.

బరితెగింపు..!


- కళ్యాణదుర్గం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో అవినీతి దందా
- డబుల్ చలానా కట్టించుకున్న వైనం

కళ్యాణదుర్గం, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో అవినీతి దందా వెలుగు చూసిం ది. వివరాలు ఇలా.. పట్టణంలోని వాల్మీకి సర్కిల్‌లో నివా సం ఉంటున్న జీ.సురేష్‌బాబు తన ఇంటిని మార్ట్‌గేజ్ చేయించుకోవడం కోసం రిజిస్ట్రేషన్‌కు డాక్యుమెంట్లను సిద్ధం చేసి, ఓ డాక్యుమెంట్ రైటర్‌కు ఇచ్చాడు. ఆ దరఖాస్తులను పరిశీలించి మార్ట్‌గేజ్ రిజిస్ట్రేషన్‌కు సిద్ధం చేశారు. రిజిస్ట్రేషన్ ఫీజు రూ.1,21,200 లు అవుతుందని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలోనే సీలు వేయించుకుని ఆ ఇంటి యజమానికి వివరించి చెప్పారు. దీంతో ఆ ఇంటి యజమానికి ఆ మొత్తానికి కూడా డబ్బు ఇచ్చి రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడు. ఇదంతా మోసమని ఓ బ్యాంకు అధికారులు ఆ ఇంటి యజమానికి వివరించి చెప్పారు. దీంతో ఆయన తనతో ఎందుకు ఇంత డబ్బు వసూలు చేశారని, తన డబ్బు వెనక్కి ఇవ్వాలని డాక్యుమెంట్ రైటర్‌తో వాదించారు. తన తప్పేమి లేదని, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలోనే అంత మొత్తాన్ని వేశారని, ఆయన సమాధానం చెప్పాడు. ఈక్రమంలోనే సమస్య పెద్దది అవుతుందని గ్రహించి, ఎవరికి చెప్పవద్దని రూ.61,500 వెనక్కి ఇచ్చేశారు.

ఆ రిజిస్ట్రేషన్‌కు రూ.60,500 మాత్రమే చలానా కట్టించుకోవాల్సిందిపోయి, రెండింతలు కట్టించుకుని, అదనపు వసూళ్లకు బరితెగించారు. ఈ కార్యాలయంలో బయటపడ్డ అవినీతి ఆ నోట, ఈ నోట పడి చివరికి పట్టణమంతా వ్యాపించి చర్చనీయాంశంగా మారింది. ఈ విషయమై సబ్ రిజిస్ట్రార్ నారాయణ స్వామిని వివరణ కోరగా అటువంటిది ఏమి చేయలేదని, తన దృష్టికి రాలేదన్నారు. పొంతనలేని సమాధానం చెప్తుతూ ఆ విషయమే తనకు తెలియదంటూ కొట్టి పారేశారు.



సురేష్‌బాబు చేసుకున్న దరఖాస్తు



ఓ అధికారి రాసి ఇచ్చిన ఖర్చు మొత్తం

సబ్‌రిజిస్ట్రార్‌పై చర్యలు తీసుకోండి

కళ్యాణదుర్గం పట్టణంలో పనిచేస్తున్న సబ్-రిజిస్ట్రార్‌పై చర్యలు తీసుకోవాలని దళిత జనజాగృతి అధ్యక్షుడు ఆర్కే రాజు సోషల్ మీడియా వేదికగా డిమాండ్ చేశారు. మంగళవారం సోషల్ మీడియాలో వీడియోను పోస్టు చేసి వైరల్ చేశారు. కళ్యాణదుర్గం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ప్రభుత్వ భూములు కూడా రిజిస్ట్రేషన్ చేస్తున్నారని సర్వే నెంబర్ల వారీగా సోషల్ మీడియాలో వివరాలు వెల్లడించారు. 2025లో ఎక్కడెక్కడ అక్రమంగా రిజిస్ట్రేషన్ చేశారు, వాటి వివరాలు వివరించారు. ఇష్టానుసారంగా డబ్బులు తీసుకుని రిజిస్ట్రేషన్ చేస్తున్నారని అన్నారు. అవినీతికి కేరాఫ్ అడ్రస్‌గా కళ్యాణదుర్గం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం మారిపోయిందన్నారు. పూర్తి ఆధారాలతో ఉన్నతాధికారులకు నివేదికలు అందచేస్తామన్నారు.



సోషల్ మీడియాలో వివరాలు వెల్లడిస్తున్న ఆర్కే రాజు

ముగిసిన పౌష్టికాహార పక్షోత్సవాలు

రాయదుర్గం, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహార పద్ధతి ఉత్సవాల కార్యక్రమాలు ముగిసినట్లు ఐసీడీఎస్ సీడీపీఓ పద్మావతి తెలిపారు. మంగళవారం మండలంలోని వడ్రవన్నూరు గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహార పక్షోత్సవం నిర్వహించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 15 రోజుల నుంచి పౌష్టికాహార పక్షోత్సవం నిర్వహించినట్లు తెలిపారు. గ్రామాల్లో సమావేశాలు నిర్వహించి అంగన్‌వాడీ కేంద్రాల్లో బాలింతలకు, గర్భవతులకు, పిల్లలకు ఇస్తున్న పౌష్టికాహారం గురించి వివరించామన్నారు. అదే విధంగా పుట్టిన బిడ్డకు ముర్రుపాలు తాగించాలని సూచించారు.

ఉద్యోగాలకు దరఖాస్తుల స్వీకరణ

యల్లనూరు, ఏప్రిల్22(ఆంధ్రజ్యోతి): మండలంలోని కేజీబీవీ బాలికల పాఠశాలలో టైప్‌త్రీ ఉద్యోగాలకు ఆసక్తిగల మహిళలు దరఖాస్తు చేసుకోవాలని ఎంఈఓ చంద్రశేఖర్ తెలిపారు. హెడ్‌కుక్ -1, స్వీపర్ -1 ఖాళీగా ఉన్నాయన్నారు. ఆసక్తి కలిగిన వారు ఈనెల 30లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ఉద్యాన రైతులను ఆదుకోవాలి



బొప్పాయి పంటను పరిశీలిస్తున్న నాయకులు

పెద్దవడుగూరు, ఏప్రిల్22(ఆంధ్రజ్యోతి): అకాల వర్షాల వల్ల నష్టపోయిన ఉద్యాన రైతులను ఆదుకోవాలని రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు వెంకటరాముడుయాదవ్ డిమాండ్ చేశారు. మండలంలోని వీరేపల్లి గ్రామంలో అకాల వర్షాల వల్ల రైతు విరుపాక్షిరెడ్డికి చెందిన దెబ్బతిన్న బొప్పాయిపంటను మంగళవారం ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఉద్యాన, రెవెన్యూ, వ్యవసాయ శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి, నష్టం నివేదికలు ప్రభుత్వానికి పంపాలన్నారు. వాణిజ్య పంటలకు ఎకరాకు రూ.50వేలు, పండ్లతోటలకు ఎకరాకు రూ.1లక్ష నష్ట పరిహారం అందించాలని డిమాండ్‌చేశారు. కార్యక్రమంలో సీపీఐ మండల సహాయ కార్యదర్శి పోలా రంగస్వామి, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

నల్ల రిబ్బన్లతో తపాలా ఉద్యోగుల నిరసన



నల్లరిబ్బన్లతో నినాదాలు చేస్తున్న ఉద్యోగులు

కంబదూరు, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ తపాలాశాఖ ఉద్యోగులు నల్ల రిబ్బన్లతో పోస్టాఫీస్ వద్ద మంగళవారం నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ 8 గంటల పని, పెన్షన్ సహా అన్ని ప్రయోజనాలను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఇంక్రిమెంట్లు మంజూరు చేసి ఆర్థిక ఉన్నతి కల్పించాలన్నారు. గ్రూప్ ఇన్సూరెన్స్ రూ.5 లక్షలకు పెంచాలని డిమాండ్ చేశారు. గ్రాట్యుటీ కూడా రూ.5 లక్షలు పెంచాలన్నారు. అన్ని రకాల వేధింపులను ఆపివేయాలని డిమాండ్ చేశారు. తపాలశాఖ ఉద్యోగులు శ్రీనివాసులు, మల్లేష్, సుదర్శన్‌రెడ్డి, వజీర్ భాషా, గంగాధర్, దేవరాజు, సిబ్బంది తదితరులు నిరసన వ్యక్తం చేసిన వారిలో ఉన్నారు.

ఫొటోల కోసం ఎంపీడీఓతో వాగ్వాదం

కూడేరు, ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): ఎంపీడీఓ కార్యాలయంలో సీఎం, డిప్యూటీ సీఎం ఫొటోలు లేవని సోషల్ మీడియాలో వైరల్ కావడంతో తెలుగు తమ్ముళ్లు మంగళవారం స్పందించారు. రెండు నెలలుగా ఎంపీడీవో కార్యాలయంలో సీఎం, డిప్యూటీ సీఎం, ఆర్థిక శాఖ మంత్రి ఫొటోలు ఎందుకు పెట్టలేదని మద్దినేని వెంకటనాయుడు, కొర్రకోడు కుంటెన్న, చాకలి మహేష్ తదితరులు ఎంపీడీవో కుళ్లాయిస్వామితో వాగ్వాదానికి దిగారు. ఫొటోలు పెట్టవద్దని ఎవరైనా ఒత్తిడి తెచ్చారా లేక అలసత్వం వహించారా? అంటూ మండిపడ్డారు. సాయంత్రంలోపు ఫొటోలు ఏర్పాటు చేస్తానని హామీ ఇవ్వడంతో టీడీపీ నాయకులు శాంతించారు.

గుత్తి సబ్ జైలు తనిఖీ

గుత్తి ఏప్రిల్ 22(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రత్యేక సబ్‌జైలును జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ కార్యదర్శి శివప్రసాద్‌యాదవ్ మంగళవారం తనిఖీ చేశారు. జైల్లోని బ్యారెక్‌లు, మరుగుదొడ్లు, వంటగది, స్టోర్‌రూంను తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. జైలు సూపరింటెండెంట్ మహేశ్వరుడు, న్యాయవాదులు సూర్యనారాయణ, గంగాధర్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేడు వక్ఫ్ బిల్లుపై సమీక్ష

పామిడి, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని షాదీఖానాలో బుధవారం వక్ఫ్ సవరణ బిల్లుపై సమీక్షించనున్నట్లు యునైటెడ్ జాయింట్ యాక్షన్ కమిటీ నాయకులు కే రహీం మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సమీక్షకు ముస్లిం మైనార్టీలు హాజరవ్వాలని ఆయన కోరారు.